2002 గుజరాత్ అల్లర్లు
మోడీదే
ప్రధాన బాధ్యత
• ఆనాటి ఊచకోత రాజకీయ ప్రేరేపితం
• నివేదికలోని ముఖ్యాంశాలతో బిబిసి డాక్యుమెంటరీ
• లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 167 | విజయవాడ, గురువారం 19 జనవరి 2023 | 6+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 19 January 2023 | Rs



జెండా ఆవిష్కరిస్తున్న హేమలత

సమైక్య పోరాటాలు

అరుణపతాకావిష్కరణ అనంతరం హేమలత
బెంగళూరులో ఉత్సాహంగా సిఐటియు మహాసభ ప్రారంభం
రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు • అమరవీరులకు నివాళి

శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి షఫీవుల్లా

ఎర్రజెండా రెపరెపలు... రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు.. ఇంక్విలాబ్ జిందాబాద్.. అంటూ హోరెత్తిన నినాదాల మధ్య సిఐటియు అఖిల భారత 17వ మహాసభ బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్ (శ్యామల్ చక్రవర్తి నగర్)లో బుధవారం స్ఫూర్తి దాయకంగా ప్రారంభమైంది. మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు అధ్యక్షులు డాక్టర్ కె హేమలత అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం సమైక్య పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

దేశం నలుమూలల నుండి వచ్చిన కార్మిక ప్రతినిధులు 'వర్కర్స్ యూనిటీ జిందాబాద్.. మజ్దూర్-కిసాన్ ఏక్తా.. అప్‌అప్ సోషలిజం.. డౌన్‌డౌన్ క్యాప్టలిజం.. ఇంక్విలాబ్ జిందాబాద్.. సమాజివాద్ జిందాబాద్... సిఐటియు జిందాబాద్' అంటూ చేసిన నినాదాలు మారుమ్రోగాయి. అంతకు ముందు కెప్టెన్ మునిరాజ్ నేతృత్వంలోని రెడ్ షర్ట్ వాలంటీర్ల బృందం హేమలతకు గార్డ్ ఆఫ్ హానర్ చేసింది. అనంతరం కోలార్ గోల్డ్ ఫీల్డ్ పోరాటంలో అసువులు బాసిన అమరులను స్మరించుకుంటూ అక్కడ నుంచి తీసుకొచ్చిన అమరవీరుల జ్యోతిని ఆనందరాజు నేతృత్వంలోని బృందం హేమలతకు అందజేసింది. సిఐటియు అధ్యక్షులు కె. హేమలతతో పాటు, ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది కె.సుబ్బారావుతో పాటు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులు, సౌహార్ద్ర సందేశం ఇవ్వడానికి వచ్చిన వివిధ సంఘాల నాయకులు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు కార్మిక ఉద్యమాన్ని, కార్మిక-కర్షక ఐక్యతను, మతోన్మాద ప్రమాదాన్ని వివరిస్తూ పాటలు పాడారు.

హక్కులపై దాడి : హేమలత

సిఐటియు జాతీయ అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ ప్రస్తుతం పెట్టుబడిదారీ విధానం తీవ్రమైన సంక్షోభంలో ఉందని గుర్తు చేశారు. ఈ సంక్షోభం గతంలో లాగా ఒక విభాగానికి, ఒక ప్రాంతానికి పరిమితమై లేదని చెప్పారు. అమెరికా మొదలుకుని, యూరప్, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఇలా అనేక దేశాల్లో తీవ్రమైన సంక్షోభం నెలకొందని గుర్తు చేశారు. దేశంలోనూ దీని ప్రభావం ఉందన్నారు. ఈ క్రమంలో కార్మిక హక్కులు మరింత హరించబడుతున్నాయని చెప్పారు. పెరుగుతున్న ధరలకు తగ్గట్టు వేతనాలు పెరగడం లేదన్నారు. ఈ విధానాలను సరైన పద్ధతిలో అర్థం చేసుకుని సమైక్య పోరాటాలను నిర్మించాల్సిన అవసరముందని ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

ప్రజల మధ్య ఐక్యత పెంచాలి : తపన్‌సేన్

ఆర్థిక సంక్షోభం పెరిగే కొద్దీ పెట్టుబడిదారీ విధానం మతాలు, రంగులు, జాతుల పేరుతో ప్రజల మధ్య చీలిక తీసుకొచ్చి దృష్టి మల్లించే ప్రయత్నం చేస్తోందని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ అన్నారు. భారతదేశంలోనూ మతత్వం పేరుతో ప్రజలను విడగొట్టి ప్రయత్నం సాగుతోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వర్గ పోరాటంతోపాటు, సామాజికపోరాటాలపైనా దృష్టి సారించాలని, ప్రజల మధ్య ఐక్యత పెంచి పోరాటాల్లో భాగాస్వామ్యులను చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలకుల విధానాలకు అనుగుణంగా కార్మిక సమస్యల్లోనూ మార్పులు వస్తున్నాయన్నారు. యజమాని, కార్మికుడి మధ్య సంబంధాల్లోనూ మార్పులు జరుగుతున్నాయన్నారు. వాటిని సరైన పద్ధతిలో గమనించి, అర్థం చేసుకుని పోరాటాలను రూపొందించాల్సిన అవసరం మనపై ఉందని సూచించారు.

సంతాప తీర్మానాలకు ఆమోదం

మహాసభ మొదటి రోజు రెండు సంతాప తీర్మానాలను ప్రవేశపెట్టారు. మొదటిది గత మహాసభ నుంచి ఇప్పటి వరకు మృతి చెందిన సిఐటియు నాయకులతోపాటు, కోవిడ్, ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందిన ప్రముఖులకు నివాళులు అర్పిస్తూ అమిత్ గుహ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం కెజిఎఫ్ పోరాటంలోనూ, మధ్యప్రదేశ్‌లో సిమెంటు కార్మికుల పోరాటంలో హత్యగావించబడిన సిఐటియు నాయకులు మనీష్ శుక్లాకు నివాళులు అర్పిస్తూ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వేరువేరుగా ప్రవేశపెట్టిన ఈ తీర్మానం అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి మహాసభ ద్వారా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులపై జరిగిన దాడిని మహాసభ ఖండించింది.



అది సామ్రాజ్యవాద యుద్ధమే
• కార్మికులకు తీవ్ర నష్టం
• డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిర్టిసిస్
లోపలి పేజీలో..



అభివాదం చేస్తున్న నాయకులు

బిజెపి ఓటమే లక్ష్యం

బిఆర్ఎస్ తొలి బహిరంగ సభలో నేతల పిలుపు

- బిజెపితో ప్రజాస్వామ్యానికి ముప్పు : పినరయి విజయన్
- గవర్నర్లు రాజకీయం చేస్తున్నారు : కేజ్రీవాల్
- ప్రధాని మోడీ చెప్పేవన్నీ అబద్దాలే : భగ్వంత్ మాన్
- సమాఖ్య వ్యవస్థకు తూట్లు : డి రాజా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యాన్ని, భారతీయ లౌకిక విధానాన్ని, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోన్న బిజెపిని ఓడించాలని భారతీయ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) తొలి బహిరంగ సభ పిలుపునిచ్చింది. విపక్ష పార్టీలన్నీ అదే లక్ష్యంగా పనిచేయాలని కోరింది. ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన ఖమ్మంలో బుధవారం జరిగిన బిఆర్ఎస్ బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సిఎం భగ్వంత్ మాన్, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, యుపి మాజీ సిఎం అఖిలేష్ యాదవ్, పలు ప్రాంతీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. కేరళ సిఎం పినరయి విజయన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి బిజెపి ముప్పుగా మారిందన్నారు. దేశ సమగ్రతను, లౌకికతత్వాన్ని, సామాజిక న్యాయాన్ని, హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తెలిపారు. కేంద్రప్రభుత్వ వైఖరితో దేశంలో లౌకికతత్వం ప్రమాదంలో, రాజ్యాంగం సంక్షోభంలో పడ్డాయన్నారు. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగేలా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, రాష్ట్రాల హక్కులు, అధికారాలను కాలరాస్తోందని, గవర్నర్ల ద్వారా రాష్ట్రాలను నియంత్రించేందుకు యత్నిస్తోందని విమర్శించారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొని ప్రభుత్వాలను కూల్చేందుకు బిజెపి కుట్రలు చేస్తోందన్నారు. కులం, మతం పేరుతో దేశాన్ని నిలువునా చీలుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాతృ భాషలను చంపే ప్రయత్నంలో భాగంగానే రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. కార్పొరేట్లకు తొత్తుగా ప్రధాని మోడీ మారారని, న్యాయ వ్యవస్థను కూడా చిన్నాభిన్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష పార్టీలను ఏకతాటిపైకి తెచ్చినందుకు కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మాట్లాడుతూ బిజెపి నియమించిన గవర్నర్లంతా రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణ, కేరళలో గవర్నర్లు ఏం చేస్తున్నారో ప్రజలందరూ చూస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులకు అడ్డు తగలడమే గవర్నర్ల పని అన్నట్లుగా ఉందని విమర్శించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగ్వంత్ మాన్ సింగ్ మాట్లాడుతూ రంగురంగుల పూల సమాహారమైన దేశంలో ఒకే పువ్వు ఉండాలని కొందరు చూస్తున్నారని బిజెపిని ఉద్దేశించి విమర్శించారు. ప్రధాని మోడీ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. లోకతంత్రం కాదు... లూటీ తంత్రాన్ని బిజెపి నడిపిస్తోందని దుయ్యబట్టారు. భగత్ సింగ్‌ను స్మరించుకున్న ఆయన 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదం చేసి ప్రసంగం ముగించారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ బిజెపిని ఓడించడమే అందరి ముందున్న కర్తవ్యమన్నారు. బిజెపి పాలనలో భారతదేశం అతిపెద్ద సంక్షోభంలో ఉందని తెలిపారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ కలిసి సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. దేశంలో లౌకికతత్వం ప్రమాదంలో పడిందని, భారత్‌ను హిందూ దేశంగా మార్చే ప్రమాదం కనబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపిపై ఐక్యపోరాటానికి ఈ సభ నాంది కావాలని ఆయన ఆకాంక్షించారు. యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో బిజెపిని తరిమికొడదామని, యుపిలో కూడా ఆ పార్టీని వెళ్లగొడుతామని అన్నారు. ప్రగతిశీల నేతలు ఒక్కటి కావాలని ఆకాంక్షించారు.

ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకే బిఆర్ఎస్ పుట్టింది : కెసిఆర్

ప్రశ్నించడంతో పాటు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు బిఆర్ఎస్ పుట్టిందని ఆ పార్టీ మిగతా 5లో

హెలికాప్టర్ కుప్పకూలి ఉక్రెయిన్ హోంమంత్రి హఠాన్మరణం

• ఆయన సహా 18 మంది మృతి

కీవ్ : ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెలుపల బ్రోవరీ నగరంలో కిండర్‌గార్టెన్ స్కూలుకు సమీపంలో బుధవారం హెలికాప్టర్ కూలిపోయి ఘోర ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఉక్రెయిన్ హోంమంత్రి డెనీస్ మోనాస్టీయర్ స్కీ సహా 18 మంది మరణించారని ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు. మంత్రితో పాటు ఆ మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు కూడా మృతి చెందిన వారిలో వున్నారని నేషనల్ పోలీసు చీఫ్ తెలిపారు. నర్సరీ, నివాస భవనానికి సమీపంలో హెలికాప్టర్ కూలడంతో మృతుల్లో ముగ్గురు చిన్నారులు వున్నారని అధికారులు తెలిపారు. గాయపడిన మరో పది మందిని ఆస్పత్రిలో చేర్చారు. సంఘటనా స్థలం వద్ద విషాదకర దృశ్యాలను చూపిస్తున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ ప్రమాదం సంభవించిన సమయంలో పిల్లలు, ఉద్యోగులు కిండర్‌గార్టెన్‌లో వున్నారని కీవ్ ప్రాంతీయ పాలనా విభాగ చీఫ్ ఒలెక్సీ కులేబా తెలిపారు.

మోగిన ఈశాన్య ఎన్నికల నగారా

- మూడు రాష్ట్రాలకు షెడ్యూల్ విడుదల
- త్రిపురలో ఫిబ్రవరి 16న
- మేఘాలయ, నాగాలాండ్‌ల్లో ఫిబ్రవరి 27న పోలింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మూడు ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన ఎన్నికల నగారా మోగింది. త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ శాసన సభల ఎన్నికల షెడ్యూలును కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ బుధవారం ప్రకటించారు. నాగాలాండ్ శాసన సభ పదవీ కాలం మార్చి 12తోనూ, మేఘాలయ అసెంబ్లీ మార్చి 15తోనూ, త్రిపుర శాసన సభ పదవీ కాలం మార్చి 22తోనూ ముగుస్తుంది. నాగాలాండ్, మేఘాలయ, త్రిపురలలో ఒకొక్క రాష్ట్రంలోనూ 60 శాసన సభ స్థానాలు ఉన్నాయి. మొత్తంగా 180 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. త్రిపురలో ఫిబ్రవరి 16న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. మేఘాలయ, నాగాలాండ్‌ల్లో ఫిబ్రవరి 27న పోలింగ్ జరుగుతుందని తెలిపింది. ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మార్చి 2న వెలువడతాయి. ఎన్నికల్లో జరిగే అక్రమాలపై సీవిజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కి తెలియజేయవచ్చునని రాజీవ్ కుమార్ తెలిపారు. 9,125 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు, 80 శాతానికి పైగా పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోనేనని తెలిపారు. 70శాతం పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోగా స్పందిస్తామని చెప్పారు. ప్రలోభాలు లేకుండా ఎన్నికలు స్వేచ్ఛగా జరగాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. త్రిపురలో ప్రస్తుతం బిజెపి,ఐపిఎఫ్టి ప్రభుత్వం ఉంది. నాగాలాండ్‌ను నేషనలిస్ట్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ పరిపాలిస్తోంది. మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీ కూటమి ప్రభుత్వం ఉంది.

త్రిపుర	
ఓటర్లు :	28,23,822
పోలింగ్ స్టేషన్లు :	3,328
అసెంబ్లీ స్థానాలు :	60
జనరల్ 30, ఎస్‌టి 20, ఎస్‌సి 10	
గెజిట్ నోటిఫికేషన్	జనవరి 21
నామినేషన్లకు గడువు	జనవరి 30
నామినేషన్ల పరిశీలన	జనవరి 31
నామినేషన్ల ఉపసంహరణకు గడువు	ఫిబ్రవరి 2
పోలింగ్	ఫిబ్రవరి 16
కౌంటింగ్	మార్చి 2

జిఓ-1పై సుప్రీంకోర్టులో నేడు విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


జిఓ నెంబర్ 1 నిలిపివేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం విచారించనుంది.



గురువారం విచారణ జాబితాలో చేర్చేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ బుధవారం సమ్మతించారు. తాము దాఖలు చేసిన పిటిషన్ ను అత్యవసర విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది మహ్ఫూజ్ నజ్కీ బుధవారం సిజెఐ ఎదుట ప్రస్తావించారు. ఈ దశలో పిటిషనర్ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తరపు న్యాయవాది అమిత్ పాయ్ స్పందిస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల గడువు సోమవారంతో ముగుస్తుందని తెలిపారు. దీనికి స్పందించిన సిజెఐ పిటిషన్ ను గురువారం విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

ఇ-క్రాప్ డేటా మేరకు ధాన్యం కొనుగోలు

- వ్యవసాయశాఖ సమీక్షలో సిఎం జగన్
- ఉత్తరాంధ్రలో డ్రోన్లపై శిక్షణా కేంద్రం
- మాండస్ బాధిత రైతులకు నష్టపరిహారం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇ-క్రాప్ డేటా మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని, మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మిగిలిన ధాన్యం సేకరణ కూడా చేయాలని అధికారులకు సిఎం సూచించారు. రైతులకు మిల్లర్లతోపని ఉండకూడదని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయంతోనే రైతుల పని ముగుస్తుందని, అనంతరం అంతా ప్రభుత్వానిదేనని ఆ అంశాలన్నీ రశీదుల మీద స్పష్టంగా పేర్కొనాలని సిఎం స్పష్టం చేశారు. వ్యవసాయశాఖపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ విషయంలో గత ప్రభుత్వం ఏ రోజు కూడా రైతులకు మేలు చేయలేదని, గత ప్రభుత్వంతో పోలిస్తే సేకరణ కూడా తమ ప్రభుత్వంలో అధికంగా జరిగిందని సిఎం స్పష్టం చేశారు. రబీలో రైతులకు విత్తనాలు, ఎరువులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని, ఆర్‌బికెల ద్వారా ఎరువులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ యూనివర్శిటీ ద్వారా డ్రోన్ల వినియోగంపై శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటును వేగవంతం చేయాలని, ఉత్తరాంధ్రలోనూ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మాండస్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌పై కార్యాచరణ చేపట్టాలని, ప్రతి ఏటా ఏప్రిల్ నెలలో సాయిల్ టెస్టింగ్ జరిగేలా చూసుకోవాలని, తర్వాత సర్టిఫికెట్లను రైతులకివ్వాలని సూచించారు. ఫలితాలు ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలన్న దానిపై రైతులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. పంటకు అవసరమైన పోషకాలను సూచించాలని, భవిష్యత్‌లో ప్రతి ఆర్‌బికెలోనూ సాయిల్ టెస్టు పరికరాలు ఉంచాలని, ఇందుకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలను కూడా రూపొందించుకోవాలని అన్నారు. ప్రతి గ్రామంలో సాయిల్ టెస్టింగ్ తర్వాత మ్యాపింగ్ కూడా జరగాలని, ఫలితంగా ఎరువులు, రసాయనాల వినియోగం అవసరాల మేరకే జరుగుతుందని అన్నారు. రైతులకు పెట్టుబడులు ఆదా కావడంతోపాటు కాలుష్యమూ తగ్గుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ను ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల వినియోగంపై కార్యాచరణ రూపొందించామని అధికారులు సిఎంకు వివరించారు. ఆర్‌బికెల స్థాయిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు, కిసాన్ డ్రోన్లు, రైతులకు 50 శాతం సబ్సిడీతో వ్యక్తిగత వ్యవసాయ పరికరాల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి, మే, జూన్ నెలల్లో ఈ కార్యక్రమాలను అమలు చేస్తామని అధికారులు సిఎంకు వివరించారు. రెండువేలడ్రోన్లను పంపిణీ చేసే దిశగా కార్యాచరణ చేశామని, తొలి విడతగా రైతులకు 500 ఇస్తామని, గత డిసెంబరు నుంచే డ్రోన్ల వినియోగంపై శిక్షణ ప్రారంభించామనీ పేర్కొన్నారు. 2014-19 మధ్య ఆహార ధాన్యాల సగటు ఉత్పత్తి 153.95 లక్షల మెట్రిక్ టన్నులు కాగా 2019-23 ఖరీఫ్ వరకే సగటు ఆహార ధాన్యాల మిగతా 2లో

క్యూబా సంఘీభావ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లాటిన్ అమెరికా విప్లవ యోధుడు చేగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా (పిల్లల వైద్య నిపుణులు), మనమరాలు ప్రొఫెసర్ ఎస్తిఫినా (అర్థశాస్త్ర ఆచార్యులు) భారతదేశ పర్యటనలో భాగంగా ఈ నెల 23న విజయవాడ వస్తున్నారని సంఘీభావ వేదిక కన్వీనర్లు సుంకర రాజేంద్రప్రసాదు, బుడ్డిగ జమిందారు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదురొడ్డి నిలిచి పోరాడుతున్న సోషలిస్టు క్యూబాకు సంఘీభావంగా జరిగే ఈ సభలో వామపక్ష, అభ్యుదయ, ప్రజాతంత్ర వాదులకు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు పెద్దఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమేనని వారు ప్రభుత్వంలో మమేకమై వుంటే వారి సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు వచ్చినా తలుపులు తెరిచే వుంటాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లిలోని సిఎస్ఆర్ కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ గజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం 2023వ సంవత్సరపు క్యాలండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ ఉద్యోగులు పదోన్నతులు, సర్వీస్‌మేటర్‌లకు సంబందించి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి రాజన్నదొర, ఆదిమూలపు సురేష్, ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీలు డొక్కామాణిక్యవరప్రసాద్, మొండితోక అరుణ్‌కుమార్, సోషల్ జస్టిస్ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు, ఎపి గజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వై ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కెవి రమణ, ఎం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



చంద్రబాబుతో రామకృష్ణ భేటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కలిశారు. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఇరువురు జివో 1పై చర్చించారు. హైకోర్టు ఈ జివోను సస్పెండ్ చేయ్యడం, తదుపరి విచారణ ఉండగానే ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో వీరు భేటీ అయ్యారు. ఇతర రాజకీయ పార్టీలను కూడా కలుపుకుని ఈ జివో రద్దు కోసం పోరాటం చేయాలని నిర్ణయించారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఆ పార్టీ నాయకులు టిడి జనార్ధన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విద్యుత్ టారీఫ్‌పై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పంపిణీ సంస్థలు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 21 వరకు ఆన్‌లైన్‌లో జరగనుంది. ఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ సివి నాగార్జున రెడ్డి అధ్యక్షతన ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఇపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ మూడు డిస్కంలు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.52,590 కోట్లు అవసరమని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఇందులో రూ.13,489కోట్లు లోటుగా డిస్కంలు పొందుపరిచాయి. ఫెర్రో ఎల్లార్సు ఇతర విద్యుత్ అధికంగా వాడే పరిశ్రమలపై రూ.697 కోట్లు చార్జీలు పెంచుతామని డిస్కంలు ప్రతిపాదించాయి. మిగిలిన ఏ రంగం వినియోగదారులపై అదనపు భారాలను డిస్కంలు ప్రతిపాదించలేదు. అయితే రూ.12,792 కోట్ల భారీ లోటును ఏ విధంగా పూడ్చుకుంటాయో స్పష్టతను ఇవ్వలేదు. మూడు రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అంశాలను పరిశీలించాక ఎపిఇఆర్‌సి మార్చి 31లోపు విద్యుత్ టారిఫ్ ప్రకటిస్తుంది. ఈ టారిఫ్ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది.

ఘనంగా లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కార వేడుక

- రాఘవేంద్రరావు, జయసుధ, జయప్రదలకు ఎన్‌టిఆర్ శత జయంతి పురస్కారం
- వేమూరి బలరామ్‌కు సాహిత్య పురస్కారం



స్వాతి పత్రిక వ్యవస్థాపక సంపాదకులు వేమూరి బలరామ్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తదితరులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఫౌండేషన్ పురస్కార ప్రదానోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, నటీమణులు జయసుధ, జయప్రదలకు ఎన్‌టిఆర్ శత జయంతి పురస్కారాలతోపాటు లక్ష రూపాయల నగదు బహుమతిని బహూకరించారు. 18 ఏళ్లుగా ఎన్‌టిఆర్ వర్ధంతి రోజున ప్రదానం చేస్తున్న సాహిత్య పురస్కారంతోపాటు రూ.2 లక్షల నగదు బహుమతిని ఈ ఏడాదికిగాను స్వాతి పత్రిక వ్యవస్థాపక సంపాదకులు వేమూరి బలరామ్‌కు అందజేశారు. సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు డాక్టర్ కూచిభొట్ల ఆనంద్, కెఎల్ యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, జిఎస్ఎల్ మెడికల్ కాలేజీ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావులకు లోక్‌నాయక్ ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలతోపాటు ఒక్కొక్కరికీ రూ.లక్ష నగదు బహుమతి అందించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఎన్‌టి రామారావు మరణం తర్వాత కూడా జనం హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. చలనచిత్ర రంగానికి ఆయన ఎన్‌సైక్లోపీడియా వంటి వారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా, ఆదర్శ పరిపాలకునిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపారని కొనియాడారు. సంక్షేమ పథకాల రూపకర్తగా పేరుగాంచారని, మహిళలకు పెద్దపీట వేశారని తెలిపారు. దేశంలోని ప్రముఖులకు పురస్కారాలు అందజేయడం ఎంతో గొప్ప విషయమని, అవి దేశానికి విశేష సేవలందించిన వ్యక్తుల గురించి ప్రపంచానికి తెలియజేయడమే కాకుండా యువతలో స్ఫూర్తినింపుతాయని అన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో సినీ నటులు బ్రహ్మానందం, విశాఖపట్నం ఎంపి ఎంవివి.సత్యనారాయణ, ఎయు ఉపకులపతి పివిజిడి.ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ బస్టాండ్‌లో ప్రదర్శనకు 90 ఏళ్లనాటి బస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో మొట్టమొదటి బస్ 1932లో నిజామ్ స్టేట్ రైల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు సంస్థ ప్రవేశపెట్టిన అల్బియాన్ (డెక్కన్‌క్వీన్) ప్యాసెంజర్ బస్సును ప్రజల సందర్శనార్థం విజయవాడలోని పంటిట్ నెహ్రూ బస్టాండ్ ఆవరణలోని సిటిబస్ టెర్మినల్‌లో పెట్టారు. గతంలో ఈ బస్ అరైవల్ కాంప్లెక్స్‌లో వుండేది. ఎక్కువ మంది ప్రజలకు ఆర్‌టిసి యొక్క ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ బస్‌ను బుధవారం సిటిబస్ టర్మినల్‌లో పెట్టారు. ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, రోడ్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న సమక్షంలో విజయవాడకు చెందిన రిటైర్ అయిన ఇద్దరి సీనియర్ డ్రైవర్‌లతో ఈ బస్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి నుండి నార్కట్‌పల్లి దాకా నడిచివెళుతున్న ప్రజల కష్టాలను చూసి చలించిపోయిన నిజామ్ యువరాణి జహీరాబేగం తన బంగారు నగలను అమ్మగా వచ్చిన రూ 3.71లక్షల రూపాయలను నాటి ప్రధానమంత్రి అక్బర్ హైదర్‌కు ఇచ్చి 27 బస్‌లను కొనుగోలు చేసినట్లు చెబుతారు. ఇవి 1970 దాకా రోడ్లపై తిరిగాయి. ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయి. హైదరాబాద్‌లో ఒకటి వుంటే మరొకటి విజయవాడలో వుంది. 19 సీటింగ్ కెపాసిటితో వుండే ఈ బస్‌ను ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు, ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న పరిశీలించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగులను నియంత్రించాలి

- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజల ప్రాణాలకు, పంటలకు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న ఏనుగులను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. మంగళవారంనాడు భామిని మండలం తాలాడ గ్రామంలో ఏనుగుల దాడి వల్ల గోరుచిట్టె చిన్నారావు మృతి చెందడం పట్ల విచారాన్ని వ్యక్తం చేశారు. చనిపోయిన చిన్నారావు కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో జియ్యమ్మవలస, కొమరాడ, భామిని, కొత్తూరు మండలాల్లో రెండు ఏనుగుల గుంపులు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను హెచ్చరిస్తూ ఏ ప్రకటనా చేయలేదని,. 2018 సంవత్సరం నుండి జిల్లాలో ఆరు మండలాల్లో పలు గ్రామాల్లో ఏనుగుల భీభత్సం వల్ల మూడుకోట్ల విలువైన పంట నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఏడుగురు మృతి చెందారని, పశువులూ మృత్యువాత పడుతున్నాయని వివరించారు. నాలుగు సంవత్సరాల నుండి ఏనుగులను తరలించాలని మంత్రులకు, ఫారెస్టు అధికారులకు విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేదని జిల్లా ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తోందని వివరించారు. ప్రజల ప్రాణాలుపోతున్నా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించడం గర్హనీయమని పేర్కొన్నారు. నిరసన తెలిపిన వారిపై కేసులు పెడుతున్నారని, ముఖ్యమంత్రికి ఈ అంశంపై సిపిఎం రాష్ట్ర కమిటీ 2022 మే 7న ఉత్తరం రాసినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగంలో చలనం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్లక్ష్య ధోరణి విడనాడి ఏనుగులను తరలించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక ఉద్యోగం, రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భావితరాలకు ఎన్టీఆర్ స్ఫూర్తి

వర్ధంతి సభలో చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి వ్యవస్థాపకులు, మాజీమంత్రి ఎన్‌టి రామారావు భావితరాలకు స్ఫూర్తి అని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఘనంగా నివాళు లర్పించారు. టిడిపి కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ 27వ వర్ధంతి సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ పెద్ద సంస్కరణ వాది అని, మహిళల విద్యను ప్రోత్సహించారని, రాజకీయాల్లో రిజర్వేషన్లు తీసుకొచ్చారని కొనియాడారు. ఇప్పుడు అతిపెద్ద విధ్వంసకుల్లో సిఎం జగన్ ఉన్నారని విమర్శించారు. ఎన్టీఆర్ గట్టిగా ప్రశ్నించే విధానాన్ని, చైతన్యాన్ని అందించారని, ఆ స్ఫూర్తితో ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో జనం తరలివస్తున్నారని, జివో 1తో అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరు రాజకీయాల్లో రావాలని కోరారు. రాష్ట్రంలో రూ.500నోట్లు కనిపించడం లేదని, జగన్ వాటిని దాచేస్తున్నారని ఆరోపించారు. హెల్త్ యూనివర్సిటీకి ఉన్న ఎన్టీఆర్ పేరును తొలగించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ఆశించిన పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు.

తెలుగు జాతి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ నిదర్శనం : అచ్చెన్న

తెలుగుజాతి ఆత్మగౌరవానికి నిదర్శనం ఎన్టీఆర్ అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ 27వ వర్ధంతి కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని పీడపీడలా పట్టిపీడిస్తున్న జగన్ సైకోపాలనను బంగాళాఖాతంలో కలిపితేనే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అచ్చెన్నాయుడు అన్నారు. టిడిపి లౌకిక పార్టీ అని, మత సామరస్యం కాపాడే పార్టీ అని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా జగదీశ్వరి, వికలాంగుల సంఘం మాజీ అధ్యక్షులు కోటేశ్వరరావు, ఎస్సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు తదితరులు పాల్గొని ఎన్‌టిఆర్‌కు ఘన నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోళ్లు కొనసాగించాలి

- ఎపిరైతు సంఘం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధాన్యం కొనుగోళ్లు యథావిధిగా కొనసాగించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది 44 లక్షల టన్నులు సేకరణ చేయగా, ఈ ఏడాది 37 లక్షల టన్నులుగా పౌరసరఫరాలశాఖ నిర్ణయించిందన్నారు. ఈ ఏడాది దిగుబడులు బాగా ఉన్నాయని ఒక వైపు చెబుతూనే మరొక వైపు రాష్ట్రంలో 76 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయినట్లు చెబుతూ గతేడాది కంటే 7 లక్షల టన్నులు తగ్గించడమేంటని ప్రశ్నించారు. పండిన పంటలో ఇప్పటి వరకు కొన్నది 33 శాతం మాత్రమేనని, నెలాఖరు వరకు కొన్నప్పటికీ 37 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం పూర్తికాదని తెలిపారు. 50 శాతానికి పైగా ధాన్యం అమ్ముకోవడానికి మిల్లర్లపైన ఆధారపడాల్సివస్తుందని, ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయకుండా యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్పుల్లో 30 శాతం రాయితీతో ఇంటిస్థలాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్పుల్లో 30 శాతం రాయితీతో 10 శాతం స్థలాలు కేటాయించాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం గ్రామ వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టాటా వెంకట సాయి మణికంఠ, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా కో ఆర్డినేటర్లు గోపిచంద్, నవీన్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను కొనసాగించాలని

20న రౌండ్‌టేబుల్ సమావేశం : కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో పెద్దఎత్తున దళితులు, గిరిజనులు పాల్గొన్నారని తెలిపారు. 2004 నుండి 2013 దాకా కెవిపిఎస్ పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్‌ను ప్రభుత్వాలు నిధులను దారి మళ్లించి నిర్వీర్యం చేశాయని తెలిపారు. ఈ నెల 20న విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంకు రాష్ట్రంలోని దళిత, గిరిజన, ప్రజాసంఘాలతో పాటు రాజకీయపార్టీలు హాజరై ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్‌ను కొనసాగించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాలని కోరారు.

పెనుమాకలకు ఎండ్లూరి పురస్కారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డాక్టర్ పెనుమాకల భాస్కరరావుకు ఆచార్య ఎండ్లూరి సుధాకరరావు పురస్కారం ఇస్తున్నట్లు మనోజ్ఞ సాంస్కృతిక సాహిత్య వేదిక నిర్వాహకులు మానస, డాక్టర్ లక్ష్మణరావు, కె.వెంకటేశ్వరరావు, యాకమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రతి సంవత్సరం విశ్వవిద్యాలయాల్లో తెలుగు సాహిత్య పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పరిశోధక విద్యార్థికి నగదు పురస్కారం, నగదు, మెమెంటో ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఒపిఎస్ అమలు చేయాల్సిందే..


- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ఒపిఎస్‌ను అమలు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లాలో కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల యుటిఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలల విలీనం ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల విలీనం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారని తెలిపారు. పాఠశాలల కుదింపు జరుగుతోందని, దీని వల్ల ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోయి పాఠశాల వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం జిపిఎస్ కాదని ఒపిఎస్ మాత్రమేనని అన్నారు. కార్పొరేట్లకు లాభాలను చేకూర్చే సిపిఎస్ విధానాన్ని, దానికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జిపిఎస్‌ను రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్, జార్ఖండ్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తున్నామని చెప్పి, విధివిధానాలను రూపొందిస్తూ చట్టాలు చేస్తున్నాయని అన్నారు. బిజెపిపాలిత రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా పాత పెన్షన్ విధానం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా సిపిఎస్‌న రద్దు చేసి పాత ఒపిఎస్ అమలు కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు ఇచ్చి, బదిలీలు నిర్వహించాలని కోరారు. మార్చిలో జరిగే పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, నాగమణి, కోటేశ్వరప్ప, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, ఆరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన'తో కేంద్రం కళ్లు తెరిపిస్తాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

ఈ నెల 30న ఉక్కు నగరంలో చేపట్టనున్న ఉక్కు ప్రజా గర్జన సభతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, కో - కన్వీనర్ జె అయోధ్యరామ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 706వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎమ్ విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉక్కు పోరాటం సాగుతున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. సొంత గనులు కేటాయించకపోవడమే కాకుండా ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి జరగకుండా మోడీ సర్కారు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి నిర్వహిస్తున్న ఉక్కు ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దీక్షల్లో పోరాట కమిటీ నేతలు డి దేముడు, జి ఆనంద్, డి రమేష్, ఎమ్‌కెవి రాజేశ్వరరావు, మోహన్ కుమార్, ఆర్ సూరిబాబు, ఎస్‌వి నారాయణ, మహ్మద్, పెడిరెడ్ల దేముడు, రమణ, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆస్పత్రి గోడ పనులను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రారంభానికి ముందే బీటలు వారిన జిజిజిహెచ్ భవనం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కొన్నేళ్లపాటు చెక్కు చెదరకుండా ఉండాల్సిన నిర్మాణ పనులు ప్రారంభం కాకముందే కూలిపోతున్నాయని, దీనికి బాధ్యులపైన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తోన్న సెంట్రల్ ల్యాబ్ భవన నిర్మాణాన్ని బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోపు ల్యాబ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, భవనం ప్రారంభం కాకముందే గోడలు బీటలు వారాయని తెలిపారు. ఈ భవన నిర్మాణం చేసిన కాంట్రాక్టర్లు, పనులను పర్యవేక్షిస్తోన్న ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీటలు వారిన గోడలను పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రారంభం కాకముందే ఈ రకంగా గోడలు బీటలు వారడం దారుణమని తెలిపారు. భవన నిర్మాణంలో ఎక్కడా నాణ్యత పాటించలేదని, క్యూరింగ్ సరిగా లేదని అన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు, అధికారులు, అభివద్ధి కమిటీ కుమ్మక్కై ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భవనాన్ని పరిశీలించిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర నాయకులు విజయ్, రామకృష్ణ, కృష్ణ తదితరులు ఉన్నారు.



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద నిరసన తెలుపుతున్న కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్, దళిత సంఘాల నేతలు

సబ్‌ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరించాలి

- ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఆర్డినెన్స్ తేవాలి
- కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్, దళిత సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ

రాష్ట్రంలో దళిత, గిరిజనుల ఆర్థిక ప్రగతి, దళితవాడల అభివృద్ధి కోసం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా పొడిగించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్), ఇతర దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యాన బుధవారం ఆందోళన నిర్వహించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సదర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 1979-80లో స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించారని తెలిపారు. ఆ నిధులు అన్యాక్రాంతం కాకుండా చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున ఉద్యమంచిన ఫలితంగా అప్పటి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం-2013ను పదేళ్ల కాలపరిమితితో తీసుకొచ్చిందని తెలిపారు. అయితే దళిత, గిరిజనుల అభ్యున్నతికి దోహదపడే ఈ చట్టం కాలపరిమితి ఈ నెల 23తో ముగిసిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా అసెంబ్లీ నిర్వహించిన వెంటనే ఆర్డినెన్స్ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

బిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవాది సుబ్బారావు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి ప్రత్యేకంగా ఆయా రంగాలకు నిధుల కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఈ చట్టం ద్వారా కేటాయించిన నిధులను కూడా ప్రస్తుతం ప్రభుత్వం పక్కదారి పట్టించిన పరిస్థితి నెలకొందని తెలిపారు. నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలపరిమితి లేకుండా సబ్‌ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు అధ్యక్షతన జరిగిన ఆందోళనలో కెవిపిఎస్ విజయవాడ పశ్చిమ, సెంట్రల్, ఈస్ట్ సిటీల నాయకులు కర్రి మోజెస్, తాళ్లూరు నరసింహారావు, చింతల శ్రీను, డివి ప్రసాద్, కె.రూబేన్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, సిటీ అధ్యక్షులు సాంగుల పేరయ్య, రెల్లి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఎస్.నాగేంద్ర, దళిత జాగృతి సేన జిల్లా అధ్యక్షులు కె.గణేష్ పాల్గొన్నారు.

ఇ-క్రాప్ డేటా మేరకు ధాన్యం కొనుగోలు

మొదటి పేజీ తరువాయి

ఉత్పత్తి 166.09 లక్షల మెట్రిక్ టన్నులుగా అధికారులు తెలిపారు. రబీకి సంబంధించి ఇ- క్రాప్ బుకింగ్ ఫిబ్రవరి 20 నుంచి ప్రారంభిస్తామని, మార్చి, మొదటి వారంలో తుది జాబితా వెల్లడిస్తామని అధికారులు వెల్లడించారు.

మిల్లర్లు, మధ్య వర్తుల ప్రమేయంపై ఫిర్యాదు నెంబరు

ధాన్యం కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా, మిల్లర్లు, మధ్యవర్తుల ప్రమేయం ఉన్నా ఫిర్యాదు చేయడానికి వీలుగా ఒక నెంబరును ఏర్పాటు చేయాలని, రైతులు ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు వెంటనే స్పందించాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఎక్కడా నష్టం లేకుండా చూడాలని, ఇప్పుడున్న ప్రక్రియను మరింత బలోపేతం చేయాలని అన్నారు. చంద్రబాబు హయాంలో ధాన్యం కొనుగోలు సేకరణకు రూ.8 వేలకోట్లయితే ఈ ప్రభుత్వం రూ.15వేల కోట్లు సగటున ఏడాదికి ధాన్యం సేకరణకు ఖర్చు పెడుఓందని వివరించారు. గతంలో రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన సందర్భాలు లేవని, నేడు అలాంటి ధాన్యాన్నీ కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామని సిఎం వెల్లడించారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎపి అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సిఎస్ (ఎఫ్‌ఎసి) వై.మధుసూదన్‌రెడ్డి, ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం విసి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి అంబటిపై కేసు నమోదు

- లాటరీ టికెట్ల విక్రయ వ్యవహారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

లాటరీ టికెట్ల విక్రయంపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై పల్నాడు జిల్లా సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి ఆదినారాయణ బుధవారం తెలిపారు. ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్కులేషన్ స్కీమ్స్ నిషేధ చట్టంకింద ఈ కేసు నమోదు చేశారు. మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో సత్తెనపల్లిలో వైసిపి నేతలు టికెట్లు విక్రయించారు. ఈ అంశంపై జనసేన నాయకులు పోలీసులకు ఆధారాలుంచగా వారు పట్టించుకోలేదు. దీంతో జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు గుంటూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టు విచారణ చేసి రాంబాబుపై కేసు నమోదు చేసి విచారణ చేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలు వచ్చిన తరువాత కూడా సంక్రాంతి పండగ రోజు లాటరీ తీసి పలువురికి బహుమతులు అందజేశారు. గుంటూరుకు చెందిన ఒక వ్యక్తికి రూ.2 లక్షల విలువైన బంగారు నెక్లెస్ లాటరీలో దక్కింది. ఈ నేపథ్యంలో మంత్రి అంబటిపై కేసు నమోదు చేయడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది.

‘ఉపాధి’లో విజయనగరం టాప్

- ఇప్పటికే 97 శాతం పనిదినాలు పూర్తి
- మరో 30 లక్షల పనిదినాల అదనపు లక్ష్యం
- గతేడాది కంటే తగ్గిన వేతనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించింది. అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపడంతో ఇది సాధ్యమైంది. జిల్లాలో ఇప్పటి వరకూ 97 శాతం పని దినాలు పూర్తయ్యాయి. మిగిలిన మూడు శాతం పని దినాలతోపాటు మరో 30 లక్షల పనిదినాలు అదనంగా కల్పించేందుకు డ్వామా అధికారులు ప్రణాళిక రూపొందించారు. పారిశ్రామిక, సేవా రంగాల్లో అత్యంత వెనుకబాటు, పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడం, వ్యవసాయ రంగంలోనూ పెద్దగా జీవనోపాధి లేకపోవడంతో ఉపాధి హామీ విజయనగరం జిల్లా వాసులకు వరంగా మారింది. జిల్లాలో 3.51 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇతర ఉపాధి అవకాశాలు లేకపోవడంతో కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతున్నారు. దీంతో, ప్రతి జాబ్‌కార్డుపైనా ఏడాదికి వంద రోజులు పని గ్యారెంటీగా కల్పిస్తున్న విషయం విదితమే. ఈ ఏడాది జిల్లాలో కోటీ 45 లక్షల పని దినాలు కల్పించాలనిది లక్ష్యం. ఇప్పటి వరకూ కోటీ 41 లక్షల పనిదినాలు కల్పించారు. 2,053 జాబ్‌కార్డులపై ఇప్పటికే వంద రోజులు పనిదినాలు పూర్తయ్యాయి. 81 నుంచి 99 రోజులు ఉపయోగించుకున్నవారు 34,948 మంది, 71 నుంచి 80 రోజులపాటు ఉపయోగించుకున్నవారు 22,717 మంది, 50 రోజులు పని పొందినవారు దాదాపు 50 వేల వరకు ఉన్నట్టు సమాచారం. చేసిన పనులకు సంబంధించి కూలీలకు ఈ నెల నాల్గో తేదీ నాటికి రూ.283.17 కోట్ల కూలి చెల్లింపు జరిగింది. జూన్ నుంచి ఖరీఫ్ పంటలు ముమ్మరంగా సాగడం, మధ్యమధ్యలో వర్షాల కారణంగా పనులకు కొంతమేర ఆటంకం కలిగింది.

ప్రస్తుతం ఆ పనులన్నీ పూర్తి కావడం, సంక్రాంతి పండగ హడావిడి కూడా ముగియడంతో పనులు ముమ్మరంగా సాగుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు కూడా విజయనగరం జిల్లాకు 30 లక్షల పనిదినాలు పెంచుకోవాలని సూచించారు. ఈ లక్ష్యాన్ని కూడా అధిగమించే దిశగా జిల్లాలో డ్వామా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కూడా జిల్లాకు పెరగనున్నాయి. ఉపాధి హామీ కూలీలకు అందిన మొత్తంపై 60 శాతం మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మంజూరవుతాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రూ.169 కోట్ల మేర జనరేట్ అయ్యాయి. ఇందులో ఇప్పటి వరకు వినియోగించుకున్నది రూ.93 కోట్లు మాత్రమే. మిగిలిన మూడు శాతం పని దినాలతోపాటు అదనంగా నిర్దేశించిన పనిదినాల లక్ష్యాన్ని కూడా చేరుకుంటే మరింతగా ఎక్కువగా మెటీరియల్ కాంపొనెంట్ నిధులు వచ్చే అవకాశం ఉంది.

ఈ ఏడాది రూ.159 నుంచి రూ.175లోపే కూలి

ఈ ఏడాది పనికి తగ్గ ఫలితం దక్కడ లేదని ఉపాధి కూలీలు చెబుతున్నారు. గతేడాది ఒక్కపూట కష్టపడితే సగటు పని దినానికి రూ.250 నుంచి రూ.257 వరకు అందేదని, ఈ ఏడాది రెండు పూటలా పని తప్పనిసరి చేశారని, కూలి మాత్రం రూ.159 నుంచి రూ.175 మించి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ఉపాధి కల్పించడంలో లక్ష్యంతో అమలు చేస్తోన్న ఉపాధి హామీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం విధించిన కఠిన నిబంధనలే ఇందుకు కారణమని అంటున్నారు.

అదనపు లక్ష్యాన్ని చేరుకుంటాం

ఈ ఏడాది ప్రతి జాబ్‌కార్డుదారునికి వంద రోజుల పని కల్పించడంతో అదనపు లక్ష్యాన్ని చేసుకోవడానికి కృషి చేస్తున్నాం. ఉపాధి పనులు కూలీల జీవనానికి ఎంతో [illegible] తోడ్పాటునందిస్తున్నాయి. కచ్చితమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. దీనివల్ల లక్ష్యానికి అనుగుణంగా పనిదినాలు కల్పించగలుగుతున్నాం.

-జి.ఉమాపరమేశ్వరి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, విజయనగరం

జీవో 1పై కౌంటర్ దాఖలుకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

జీవో 1 జారీ చేయడాన్ని సవాల్ చేసిన కేసులో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసిందని, ఈ నేపథ్యంలో తమ ముందున్న పిల్‌పై విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేస్తున్నట్లు ద్విసభ్య ధర్మాసనం ప్రకటించింది. జీవో ద్వారా ప్రభుత్వం పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే ప్రయత్నం చేస్తోందని అభిప్రాయపడింది. రాజకీయ పార్టీలు నిర్వహించే రాజకీయ సభలు, రోడ్‌షోలకు పోలీసుల నుంచి ముందుగా అనుమతి పొందేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ జర్నలిస్ట్ కె.బాలగంగాధర్ తిలక్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం విచారించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది.

9 నెలల్లో రూ.10 వేల కోట్ల ఆదాయం

- సరుకు రవాణాలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

9 నెలల 16 రోజుల కాల వ్యవధిలో జోన్ చరిత్రలోనే అత్యంత వేగవంతంగా సరుకు రవాణా ద్వారా రూ.10 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. సరుకు రవాణా విభాగం నిరంతరం కృషిచేయడం వల్లే 100 మిలియన్ టన్నుల లోడింగ్ మార్కును దాటినట్లు తెలిపింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానంగా బొగ్గు రవాణా అవుతోందని, మొత్తం లోడింగ్‌లో 50 శాతం కంటే ఎక్కువగా ఉందని, ఆ తర్వాత సిమెంట్ 26 శాతం, ఆహారధాన్యాలు, ఎరువులు 11 శాతం లోడింగ్ అయినట్లు పేర్కొంది. సరుకు రవాణాలో రూ.10 వేల కోట్ల రాబడిని సాధించినందుకు దక్షిణ మధ్య రైల్వే ఆపరేటింగ్,కమర్షియల్ విభాగాల బృందాలను దక్షిణ మధ్య రైల్వేజనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు.

రూ.225 కోట్లతో కర్నూల్‌లో వైద్య సేవలు

కామినేని హాస్పిటల్స్ వెల్లడి



హైదరాబాద్ : వైద్య సేవల రంగంలో ఉన్న కామినేని హాస్పిటల్స్ తాజాగా కర్నూలులో ఆసుపత్రిని ప్రారంభించింది. జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్స్ పేరుతో రూ.150 కోట్లతో 150 పడకలతో దీన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాదే రూ.75 కోట్లతో 75 పడకల సామర్థ్యంతో క్యాన్సర్ చికిత్స కేంద్రం సైతం స్థాపించనున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ నగరంలో వైద్య సేవల కోసం మొత్తంగా రూ.225 కోట్ల పెట్టుబడులను పెట్టనుంది. మెరుగైన సౌకర్యాలు, మౌలిక సదుపాయాలతో వైద్య సేవలను ఈ కేంద్రం తదుపరి స్థాయికి మారుస్తుందని సంస్థ తెలిపింది. అందుబాటు ధరలో ప్రపంచస్థాయి వైద్య సేవలను అందించడం లక్ష్యంగా ఈ కేంద్రాన్ని నెలకొల్పినట్టు కామినేని హాస్పిటల్స్ తెలిపింది. జెమ్‌కేర్‌లో కార్డియాక్, న్యూరో, అనస్తీషియా, క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్, మెడికల్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, ఇఎన్‌టి, జనరల్, మినిమల్ యాక్సెస్ సర్జరీ, ప్లాస్టిక్, కాస్మెటిక్ సర్జరీ, రెనల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, యూరాలజీ, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీస్ తదితర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. నాణ్యమైన వైద్య సేవలతో కోట్లాది మందికి చేరువైన కామినేని హాస్పిటల్స్ మొత్తం 3,000లకుపైగా పడకలతో హైదరాబాద్, నార్కట్‌పల్లి, విజయవాడలో ఆసుపత్రులను నిర్వహిస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్, డెంటల్ కళాశాలలు ఉన్నాయి.

షార్‌లో మరో దారుణం

- ఎస్ఐ భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

శ్రీహరికోట షార్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. ఎస్ఐ భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. షార్‌లో సిఐఎస్ఎఫ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వికాస్‌సింగ్ సర్వీసు రివాల్వర్‌తో గత సోమవారం రాత్రి కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. భర్తను చివరిసారి చూడటానికి మంగళవారం శ్రీహరికోటకు వచ్చిన భార్య ప్రియాంక సింగ్ అర్ధరాత్రి నర్మదా గెస్ట్‌హౌస్‌లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఆర్థిక సమస్యలు, కొడుకు అనారోగ్యమే కారణమని తెలుస్తోంది. ఎస్ఐ వికాస్‌సింగ్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బీహార్ వాస్తవ్యుడు. మూడు నెలల క్రితమే శ్రీహరికోటలో ఎస్ఐగా చేరారు. కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ముగ్గురు పిల్లలు. ప్రస్తుతం వీరు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నారు. సోమవారం వేర్వేరు చోట్ల కానిస్టేబుల్ చింతామణి చెట్టుకు ఉరేసుకోవడం, ఎస్ఐ వికాస్‌సింగ్ సర్వీస్ గన్‌తో కాల్చుకుని చనిపోవడం, మరుసటిరోజే వికాస్‌సింగ్ భార్య ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో షార్‌లో విషాదం నెలకొంది. వచ్చి మూడు నెలలైనా అవ్వకముందే ఎస్ఐ వికాస్‌సింగ్ దంపతుల బలవన్మరణంపై తోటి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాయిలర్‌లో జారి మహిళా కూలీ దుర్మరణం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం/పెంటపాడు

బాయిలర్ కన్వేయర్‌లో జారి ఓ మహిళా కూలీ దుర్మరణం చెందిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో జరిగింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణయ్యపాలేనికి దేవెళ్ల వెంకటరమణ (55) 15 ఏళ్ల నుంచి ఫ్యాక్టరీలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారు. ఎప్పటిలాగానే ఉదయం ఫ్యాక్టరీలో పనికెళ్లారు. బాయిలర్ కన్వేయర్ వద్ద ఊక వేస్తుండగా ప్రమాదవశాత్తూ అందులోకి జారి ఆమె శరీరం పూర్తిగా కాలిపోయి మృతిచెందారు. ఆమె భర్త రెండేళ్ల క్రితం మరణించారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిగాయి. చిన్న అల్లుడు వల్లూరి శ్రీనివాస్ ఇదే ఫ్యాక్టరీలో తాత్కాలిక డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లాట్‌ఫారం లేకపోవడం వల్లే..

ఫ్యాక్టరీలో వెంకటరమణ పనిచేసే చోట ఫ్లాట్ ఫారం ఉండాలి. అది లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు చెబుతున్నారు. కార్మికుల పట్ల ఫ్యాక్టరీ యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

బంధువుల ఆందోళన

వెంకటరమణ కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ఫ్యాక్టరీ ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం చేసేవరకూ ఆందోళన విరమించేది లేదంటూ భీష్మించారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు ప్రసాద్, రాంబాబు, వైసిపి నాయకులు వీర్ల గోవిందరావు, జి సాంబయ్య మద్దతు తెలిపారు. దీంతో యాజమాన్యం కుటుంబ చర్చలు జరిపింది. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.18 లక్షల నష్టపరిహారం, చిన్నల్లుడికి ఫ్యాక్టరీలో పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వడానికి అంగీకరించింది.

ధాన్యం కొనుగోలు చేయాల్సిందే

- కౌలు రైతుల ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కౌలుదారు కార్డులు అందించాలని, షరతులు లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యాన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కలెక్టరేట్ వద్ద కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి అయ్యిందన్న సాకుతో మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయట్లేదన్నారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజోలు, గెద్దాడ, మామిడికుదురు, నగరం, పెదపట్నం, మొగలికుదురు బి.సావరం, చింతలపల్లి తదితర గ్రామాల్లో రైతుల వద్ద ఇంకా ధాన్యం ఉందని తెలిపారు. ధాన్యం అమ్ముకోలేక దాళ్వాకు పెట్టుబడులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మిగిలిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోనె సంచులు సరఫరా చేసి కళ్లాల నుంచే ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయాలని, కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. కౌలు రైతుల ధర్నాకు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి.వసంతకుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ పాల్గొని మద్దతు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు, కౌలు రైతులు

ధాన్యం కొనుగోలు నిలిపివేయలేదు

- ఎండి వీరపాండియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పౌర సరఫరాల సంస్థ ధాన్యం కొనుగోలు నిలిపివేయలేదని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండి జి వీరపాండియన్ పేర్కొన్నారు. ప్రతి జిల్లాలోని రైతు భరోసా కేంద్రం పరిధిలో ఉన్న రైతుల వద్ద నుంచి ధాన్యం పూర్తిగా విక్రయించామని వారి ప్రాతినిథ్యం స్వీకరించిన తర్వాత, ఏ రైతు వద్ద ధాన్యం నిల్వలేదని నిర్ధారించుకున్న తర్వాతనే ధాన్యం సేకరణ ప్రక్రియ అక్కడ ముగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతు భరోసా కేంద్రం వద్ద నియమించిన అధికారులు దీనిపై తనిఖీ చేసి రెవెన్యూ, సివిల్ సప్లై, అగ్రికల్చర్ అధికారుల ఆమోద పత్రం పొందిన తర్వాత మాత్రమే సంబంధిత రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం సేకరణ ప్రక్రియ మూసివేయనున్నట్లు తెలిపారు. ఆర్‌బికెల వద్ద ధాన్యం సేకరణ ప్రక్రియ మూసివేసే దానికి వారం రోజుల ముందు నుంచే గ్రామంలో చాటింపు వేయిస్తామన్నారు. రైతుల వద్ద ధాన్యం నిల్వలను తనిఖీ చేసి ఆ ధాన్యం నిల్వలను భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు ఎండి వీరపాండియన్ తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురంమన్యం, ఎన్‌టిఆర్ జిల్లాలకు బ్యాంకు గ్యారెంటీల రేషియోను పెంచామని, ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణ ప్రక్రియకు సంబందించి సంబందిత జిల్లాలకు కేటాయింపులు కూడా పెంచడం జరిగిందని తెలిపారు.

ఎపి ఇఎపిసెట్ కన్వీనర్‌గా శోభాబిందు

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపి ఇఎపిసెట్-23) కన్వీనర్‌గా సి.శోభాబిందు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జెఎన్‌టియు పరిపాలన భవన్‌లోని ఎపి ఇఎపిసెట్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. శోభాబిందు ప్రస్తుతం అనంతపురం జెఎన్‌టియు పరిశోధన విభాగం డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, అనంతపురం జెఎన్‌టియు విసి జి.రంగజనార్ధన తనపై నమ్మకం ఉంచి ఎపి ఇఎపిసెట్ - 2023 కన్వీనర్‌గా నియమించినందుకు కతజ్ఞతలు తెలిపారు.


మరో బెంచ్‌కు ‘ఓబుళాపురం’ కేసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో మైనింగ్ కొనసాగింపు అంశంపై ఓబుళాపురం మైనింగ్ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్ విచారణను తగిన ధర్మాసనం ఎదుట “కేసుల జాబితాలో చేర్చేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి (సిజెఐ) నివేదించాలని జస్టిస్ బి.ఆర్ గవాయ్ సుప్రీం కోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. మైనింగ్ పునఃప్రారంభానికి అనుమతించాలంటూ ఓబుళాపురం మైనింగ్ కంపెనీ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

గన్నవరం ఎయిర్‌పోర్టు ప్రయివేటీకరణ..!

- కార్పొరేట్లకు డజన్ విమానాశ్రయాలు
- బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం
- రూ.8వేల కోట్ల నిధులపై కేంద్రం దృష్టి



న్యూఢిల్లీ : విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయం ప్రయివేటీకరణకు కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం 11-12 విమానాశ్రయాలను ప్రయివేటీకరించాలని యోచిస్తోంది. వచ్చే బడ్జెట్‌లో దీన్ని వెల్లడించనుందని ఇటి ఓ కథనంలో వెల్లడించింది. విమానయాన రంగంలో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా రూ.8,000 కోట్లు రాబట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. విమానయాన రంగంలో భారీగా ప్రయివేటు పెట్టుబడులను ఆకర్షించాలని ఆ మంత్రిత్వ శాఖ చూస్తోంది. దీనిపై వచ్చే బడ్జెట్‌లో కీలక ప్రకటన వెలుపడనుంది. ప్రయివేటీకరణకు వీలుగా 11-12 విమానాశ్రయాల జాబితాను రూపొందించారు. ఇందులో విజయవాడ, రాయ్‌పూర్, జైపూర్, కోల్‌కత్తా, ఇండోర్ తదితర కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటి ప్రయివేటీకరణతో రూ.8,000 కోట్ల పైగా నిధులను సమీకరించాలని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. దీనిపై ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే 2023-24 బడ్జెట్‌లో ప్రకటన చేయగానే.. తదుపరి ఆమోదానికి పంపించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం దేశంలో 146 విమానాశ్రయాలున్నాయి. వీటిని వచ్చే కొన్ని ఏళ్లలో 200 చేర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రాబోయే ఏళ్లలో ఈ రంగంలో బలమైన వృద్ధి చోటు చేసుకోనుందని పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఇటీవల పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) పరిధిలోని మరిన్ని విమానాశ్రయాల ప్రయివేటీకరణ ప్రక్రియ కొనసాగనుందన్నారు.

సంపాదకీయం


ఉలికిపాటు

రోడ్లపై బహిరంగ సమావేశాలకు షరతులు విధిస్తూ తెచ్చిన జిఓ నెంబర్ 1 అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీం కోర్టులో సవాల్ చేయడం రాష్ట్ర ప్రభుత్వ ఉలికిపాటును తెలుపుతుంది. తన నిర్ణయానికి న్యాయస్థానాలైనా సరే అడ్డు చెప్పకూడదన్న అసహనం ప్రభుత్వంలో ప్రస్ఫుటిస్తోంది. రహదారులపై ర్యాలీలు, రోడ్‌షోలు, బహిరంగ సభలు పెట్టుకోవాలంటే ముందస్తుగా పోలీస్ పర్మిషన్ తీసుకోవాలని జనవరి 2న ప్రభుత్వం జిఓ నెం.1 జారీ చేసింది. ఈ ఉత్తర్వు వెనకున్న సర్కారు ఉద్దేశం ప్రజా ఉద్యమాలను నిరోధించడం, ప్రతిపక్ష పార్టీలను నిలువరించడానికేనన్నది దాచాలనుకున్నా దాగని వాస్తవం. సదరు జిఓకు సర్కారు ఎంపిక చేసుకున్న ప్రాతిపదిక ఏనాడో స్వాతంత్య్రానికి ముందు బ్రిటిష్ పాలకులు తెచ్చిన 1861 నాటి పోలీస్ చట్టం. గొంతు నొక్కేందుకే రాజ్యాంగ, చట్ట విరుద్ధంగా ప్రభుత్వం జిఓ తెచ్చిందంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఈ నెల 12న విచారించిన రాష్ట్ర హైకోర్టు, పోలీస్ చట్టంలోని సెక్షన్ 30కి జిఓ విరుద్ధంగా ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడి, దాని అమలును ఈ నెల 23 వరకు సస్పెన్షన్‌లో ఉంచుతూ మధ్యంతర ఆదేశాలిచ్చింది. విచారణ 20న జరుపుతామంది. మరో రెండు రోజుల్లో హైకోర్టులో విచారణ ఉండగా, జిఓ సస్పెన్షన్ కాల పరిమితి ఇంకో ఐదు రోజులే కాగా, ఆ స్వల్ప విరామాన్ని సైతం ఎందుకు భరించలేక సుప్రీం గడప తొక్కిందో ప్రభుత్వం చెబితేనే బాగుంటుంది.

జిఓపై ఇక్కడ హైకోర్టులో అక్కడ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో ప్రభుత్వ వాదనలు పొసిగేవి కావు. రెండు చోట్లా సర్కారు అభ్యంతరం హైకోర్టు విచారణార్హత మీదనే. జిఓను సవాల్ చేస్తూ వేసిన పిల్‌ను సంక్రాంతి వెకేషన్ బెంచ్ అత్యవసరంగా విచారించకూడదనే. రాజ్యాంగ, పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ప్రభుత్వ ఏ నిర్ణయాన్నైనా ప్రజా సంక్షేమం దృష్ట్యా పరిశీలించే విచక్షణ న్యాయస్థానాలకు ఉంటుంది. ఆ విషయాన్నే హైకోర్టు నొక్కివక్కాణించింది. ప్రభుత్వం కౌంటర్ వేశాక వారంలో పూర్తి స్థాయిలో విచారిస్తామనీ చెప్పింది. అప్పటి వరకు ఆగి ఉంటే ఒక రకంగా ఉండేది. ఆ మాత్రం ఓర్పు సర్కారులో కొరవడింది. రాజకీయ పార్టీలు పోలీసుల నియంత్రణ లేకుండా ర్యాలీలు, భారీ బహిరంగ సభలు నిర్వహిస్తే తొక్కిసలాటలు జరుగుతాయని, 8 మంది మృత్యువాత పడ్డ ఇటీవలి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదం ఉందని సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం తెగ బాధ పడిపోయింది. జిఓ వచ్చి పది రోజులైనా కాలేదు. అప్పుడే ఏం జరిగిందని పిల్ వేశారని హైకోర్టులో వాదించిన ప్రభుత్వం... జిఓ సస్పెన్షన్‌పై సుప్రీంలో హడావిడిగా అప్పీల్ చేయడం ఎందుకు?

మన రాజ్యాంగం పౌరులకు భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కును కల్పించింది. ప్రభుత్వాలకు అది గిట్టడం లేదు. తమ పాలనపై, విధానాలపై అసమ్మతి, వ్యతిరేకత, నిరసన తెలిపితే సహించలేకపోతున్నాయి. ఆ విషయంలో బిజెపి నాలుగు ఆకులు ఎక్కువే చదివింది. టిడిపి సైతం మినహాయింపు కాదు. ఆ కోవలో వైసిపి ప్రభుత్వం ఏకంగా జిఓ నెం.1 తెచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగం, చట్టాలకు లోబడి నడవాలి. హద్దులు దాటినప్పుడు న్యాయస్థానాలు సమీక్షించి గాడిలో పెడతాయి. తమకు అధికారం ఉంది కనుక ఏం చేసినా చెల్లుతుంది, కాదనే వీల్లేదనడం ప్రజాస్వామ్యంలో కుదరదు. గతంలో కొన్ని విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు పోయి న్యాయస్థానాల్లో చేతులు కాల్చుకున్న సందర్భాలున్నాయి. రాజకీయ పార్టీల బహిరంగ సమావేశాలపై నిషేధం లేదని సర్కారు ఉటంకింపు అర్ధసత్యం. తమకు నచ్చని వారికి వ్యతిరేకంగా నచ్చిన వారికి అనుకూలంగా పోలీసులు వ్యవహరించే పక్షపాతం సర్కారే కల్పించడం వివక్ష. ఇది ఏ రకంగా చూసినా చెల్లదు. అందుకే అన్ని వర్గాల నుంచీ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కోర్టులకెళ్లే హక్కు ఎవరికైనా ఉంటుంది. కోర్టులు చెప్పేవి చెబుతాయి. సుప్రీం విచారణ రేపో మాపో అంటున్నారు. నిరసనలతోనైనా ప్రభుత్వం విజ్ఞతతో జిఓను ఉపసంహరించుకోవాల్సింది. పాలకులకు పట్టువిడుపులు అవసరం.

మహనీయుల మాట



రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళ అభివృద్ధి సాధించనంత వరకూ సామాజిక భద్రత రాదు. అందునా పురుషాధిక్యత ఉన్న సమాజం గనుక మహిళలు ఉద్యమించాలి.

- వి.ఐ. లెనిన్

సొంతింటి కల నెరవేరేది ఎన్నడో...!

విశ్లేషణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణం ఒక రత్నం. ఇళ్లులేని నిరుపేదలకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి బీగం వేసి, బీగం చెవులు లబ్ధిదారుల చేతుల్లో పెడతామని ఎన్నికల ముందు, ఆ తరువాత కొంత కాలం వరకు వైసిపి నేతలు చెప్పారు. మొత్తం రాష్ట్ర జనాభా 4 కోట్ల 95 లక్షల మంది. అందులో ఒక కోటి 24 లక్షల మంది జగనన్న ఇళ్లల్లో వుండబోతున్నారని ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 31 లక్షల మందికి రెండు దశల్లో ఇళు కట్టబోతునామని, ప్రతి జిల్లాలో 20 నుండి 25 వేల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు కల్పిస్తామని (గత డిసెంబర్ 21న ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా) ప్రకటించి, వాయిదా వేశారు. ప్రస్తుతం జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణం ఇలాగే కొనసాగితే, ప్రభుత్వం నిర్ణయించిన ఇళ్ల లక్ష్యం పూర్తికావడానికి ఎన్నేళ్లు పడుతుందో తెలియదు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణాలు ఎందుకని ఇంత నత్తనడకన సాగుతున్నాయి? గత ప్రభుత్వాలు ఇందిరమ్మ ఇళ్లు, టిడ్కో ఇళ్లు, నేడు జగనన్న ఇళ్లు నిజంగానే పేదల స్వంత ఇంటి కలను నెరవేర్చాయా? ప్రభుత్వాలు మారుతున్నా ఇళ్ల సమస్య ఎందుకు పరిష్కారం కావడంలేదు?



వి. రాంభూపాల్

స్వంత ఇల్లు మనిషి హక్కు

మనిషి కనీసంగా జీవించడానికి కూడు, గుడ్డ, నీడ అనేవి తప్పనిసరి. వీటిని ప్రజలందరికి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు 70 సంవత్సరాల క్రితం చెప్పాయి. ఒకవైపు దేశ పాలకులు స్వాతంత్య్ర అమృతోత్సవాలు జరుపుకుంటున్నా మరోవైపు కోట్ల మందికి స్వంత ఇళ్లు లేవు. మన రాష్ట్రం మొత్తం జనాభాలో స్వంత ఇళ్లు లేని వారు మూడింట ఒక వంతు మంది వున్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ప్రపంచీకరణ విధానాలు వ్యవసాయాన్ని, చేతివృత్తులను, స్వయం ఉపాధిని తీవ్రంగా దెబ్బతీసాయి. వీటిపై ఆధారపడిన కోట్ల మంది పనులు వెతుక్కుంటూ పల్లెల నుండి పట్టణాలకు తరుమబడుతున్నారు. వీటికి తోడు తరాలనాటి కులవివక్ష, సాంఘిక అసమానతలు, పెత్తందారీ జులుం గ్రామీణ యువతను వేటాడి పట్టణాలకు చేరుస్తుంది. పట్టణాల్లో రాబందుల్లా కాసుకు కూర్చున్న కంపెనీలు, మాల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, భవన నిర్మాణ కాంట్రాక్టర్లు వీరిని పీక్కు తింటున్నారు. ప్రభుత్వాలు పెంచుతున్న సరుకుల ధరలు, ప్రజలపై పడుతున్న భారాలు ఈ పేదలపై ముప్పేట దాడి



చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పేద, దిగువ మధ్యతరగతి వారెవరు పట్టణాల్లో స్థలం కొని ఇళ్లు కట్టుకోవడం ఈ జీవిత కాలంలో జరిగే అవకాశం లేదు. గ్రామాల్లో వున్న వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులు తమ వారసులకు ఇళ్లు కట్టించడం సాధ్యం కావడంలేదు. అందుకే ఇళ్లకు పేదల నుండి డిమాండ్ ఎక్కువగా వుంటుంది. ఈ పేదలు లేకుండా పట్టణాలు, మహానగరాలు విస్తరించవు, అభివృద్ధి చెందవు. ఈ పేదలు లేకుండా నేతలకు ఓట్లు రావు, గద్దెను ఎక్కలేరు. ఈ కారణంగానే దశబ్దాలుగా పేదల ఇళ్ల సమస్యను ప్రతి పాలక పార్టీ తమ ఎన్నిక ప్రణాళికల్లో చేర్చాల్సి వస్తుంది. అనేక హామీలు ఇవ్వాల్సి వస్తుంది.

గతంలో రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టింది. దానికి ముందు వామపక్షాలు ముఖ్యంగా సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల సమస్యపై నాడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమం సాగింది. నెలల కొద్దీ ఆందోళనలు, హైదరాబాద్‌లో నిరాహార దీక్షలు, చివరకు ఖమ్మం జిల్లా ముదిగొండలో పేదల దీక్ష శిబిరంపై జరిపిన పోలీసు కాల్పుల్లో ఆరుగురు సిపిఎం కార్యకర్తలు బలయ్యారు. మూడు దశల్లో ఇళ్ల నిర్మాణం అంటూ ఆచరణలో కొద్దిమందికి మాత్రమే స్వంత ఇల్లు ఇచ్చి ఆ తరువాత ఆ పథకాన్ని అటకెక్కించారు. టిడిపి పాలనలో టిడ్కో ఇల్లు అంటూ ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఆర్భాటం చేసినా ఇళ్లు పూర్తికాకుండానే ఎన్నికలు వచ్చేసాయి. వైసిపి ప్రభుత్వం రెండుదశల్లో 30 లక్షల జగనన్న ఇళ్లు కట్టిస్తామన్నారు.

లబ్ధిదారులు ముందుగా పునాది వేసుకుంటే ప్రభుత్వం బిల్లులు ఇస్తుందన్నారు. బిల్లులు వస్తాయో రావోననే భయంతోపాటు, స్వంతంగా ఖర్చుచేసే అవకాశం లేని నిరుపేదలు పునాదులు కూడా వేయకుండానే ఆగిపోయారు. ఉదా: అనంతపురం జిల్లాలో 68,288 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు కేవలం 6,045 మాత్రమే. పునాది దశలోనే ఆగిపోయినవి 26 వేల ఇళ్లు, పునాది పూర్తయినవి 16 వేలు, పైకప్పు వరకు వచ్చి ఆగిపోయినవి మరో 5 వేల ఇళ్లు. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఆ జిల్లాలో జగనన్న ఇళ్లు వద్దని 28 వేల మంది లబ్ధిదారులు ప్రభుత్వానికి రాసి ఇచ్చారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

గతంలో నిర్మించి నిలిచిపోయిన టిడ్కో ఇళ్లు పూర్తిచేసి పేదలకు ఇవ్వకుండా అనేక సాకులు చెబుతోంది. ఈ ఇళ్ల నిర్మాణానికి ఖర్చుచేసిన వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అయింది.

జగనన్న ఇల్లు

రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలను ఈ ప్రభుత్వం గుర్తించి 30 లక్ష 60 వేల మందిని అర్హులుగా ఎంపిక చేసింది. వీరికి 15,901 లేఅవుట్ల కింద మొదటి దశలో 15 లక్షల 60 వేలు, రెండవ దశలో 12 లక్షల 70 వేల ఇళ్లు, మిగిలిన ఇళ్లను తరువాత కట్టిస్తామన్నారు. ఈ ఇళ్ల నిర్మాణానికి స్థలాల సేకరణతో మొదలుకొని, ఇల్లు కట్టడం వరకు లక్ష 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక జాయింట్ కలెక్టర్‌ను నియమించారు. ఇళ్ల నిర్మాణం గురించి ప్రభుత్వ ప్రకటనలు, ప్రభుత్వ నేతల ప్రచార కార్యక్రమాలతో హోరెత్తిస్తున్నారు. వీటన్నింటిని చూసి తమ స్వంత ఇంటి కల నెరవేరుతుందని పేదలు ఆశించారు. డిసెంబర్ 21న రాష్ట్రంలో 5 లక్షల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు చేస్తామని ప్రకటించి వాయిదా వేశారు. ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు కేవలం 1,42,556 మాత్రమే. అర్హులుగా గుర్తించిన వారందరికీ ఇళ్ళు దక్కాలంటే ఇంకెంతకాలం పడుతుందో!

జగనన్న ఇళ్ల కష్టాలు

ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం పల్లెల్లో సెంటున్నర స్థలం, లక్షన్నర రూపాయలు, పట్టణాల్లో సెంటు స్థలం లక్ష 80 వేల రూపాయలుగా నిర్ణయించారు. ఇంత తక్కువ మొత్తంతో, తక్కువ స్థలంలో కట్టే ఇల్లు నివాసం వుండడానికి ఏ మాత్రం సరిపోదు. అయినా పేదలు ఈ మాత్రం స్థలం కూడా భవిష్యత్‌లో దొరికే అవకాశం లేదు కాబట్టి అర్జీలు పెట్టుకున్నారు. పెరిగిన స్టీల్, సిమెంట్, ఇతర ధరలు, ఇసుక కొరత ఇంటి నిర్మాణానికి తీవ్ర ఆటంకాలుగా మారాయి. ఈ ఇళ్లు పూర్తి కావాలంటే ఒక మేస్త్రీ, ఇద్దరు కూలీలు కనీసం రెండునెలలు పనిచేయాల్సి వుంటుంది. మేస్త్రీకి రూ. 600 నుండి 800 వరకు, కూలీకి రూ. 400 నుండి రూ. 600 వరకు రోజు కూలీ వుంది. అంటే ఈ కూలీలకే లక్ష ఇరవై వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇనుము సుమారు ముప్పావు టన్ను పడుతుంది. దీనికి రూ. 60 నుండి రూ. 65 వేలు. సిమెంట్‌కు రూ. 50 వేలు. ఇసుక, ఇతర సామాగ్రి కోసం మరో లక్షన్నర కావాల్సి వస్తుంది. అందుకే ఇళ్లు పూర్తికావాలంటే ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. డ్వాక్రా గ్రూపుల ద్వారా మహిళలకు రుణం ఇప్పించి అందులో రూ. 35 వేలను ఇంటి నిర్మాణం కోసమని జమ చేసుకుంటున్నారు. లబ్ధిదారులు ముందుగా పునాది వేసుకుంటే ప్రభుత్వం బిల్లులు ఇస్తుందన్నారు. బిల్లులు వస్తాయో రావోననే భయంతోపాటు, స్వంతంగా ఖర్చుచేసే అవకాశం లేని నిరుపేదలు పునాదులు కూడా వేయకుండానే ఆగిపోయారు. ఉదా: అనంతపురం జిల్లాలో 68,288 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు కేవలం 6,045 మాత్రమే. పునాది దశలోనే ఆగిపోయినవి 26 వేల ఇళ్లు, పునాది పూర్తయినవి 16 వేలు, పైకప్పు వరకు వచ్చి ఆగిపోయినవి మరో 5 వేల ఇళ్లు. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఆ జిల్లాలో జగనన్న ఇళ్లు వద్దని 28 వేల మంది లబ్ధిదారులు ప్రభుత్వానికి రాసి ఇచ్చారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

జగనన్న కాలనీలు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ నుండే అధికార పార్టీ నేతలు కొందరు కాంట్రాక్టర్లు రకరకాల రూపాల్లో అవినీతికి తెరలేపారు. లే అవుట్‌లు ఎక్కడ వేస్తారో తెలుసుకొని అక్కడ ముందే పేదరైతులతో తక్కువ ధరకు భూమి కొనుగోలు చేసి, అదే భూములను నెలల తేడాలోనే లక్షల లాభాలకు అమ్ముకోవడం లేదా తమ భూములకు విలువ వచ్చేటట్లు లేఅవుట్‌లు నిర్ణయించడం చేశారు. ఈ రూపంలో రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఇలాంటి అవకాశాలు లేని చోట పట్టణానికి దూరంగా, శ్మశాన స్థలాలు, వంకలకు, వాగులకు దగ్గరగా వున్న స్థలాలు, నివాసాలు ఏర్పాటు చేసుకోలేని కొండగుట్టల్లో లేఅవుట్‌లు వేశారు. ఈ కారణాల వల్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లలో రాష్ట్రంలో 12 శాతం ఇప్పటికే రద్దు అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామాల్లో ఇచ్చిన మూడు సెంట్ల స్థలంలో కట్టిన సెంటున్నర ఇంటిని మినహాయించి మిగిలిన సెంటున్నర స్థలం జగనన్న ఇంటికి తీసుకున్నారు. జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాల కల్పన పేరుతో మట్టి రోడ్లు, విద్యుత్, బోరు, ట్యాంకు లాంటి పేర్లతో కాంట్రాక్టర్లు లాభపడ్డారు.

90 రోజుల్లో ఇంటి పట్టా

ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్లు వద్దనుకుంటే అర్జీ పెట్టుకున్న 90 రోజుల్లో ఇంటి పట్టా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. చాలా మంది పేదలు మంజూరైన ఇళ్లు వద్దని ఇంటి స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నారు. వీరిని మరల వడబోసి రాష్ట్రంలో సుమారు 3 లక్షల మందిని అర్హులుగా ఎంపిక చేశారు. ఇందులో ఒక్కరికి కూడా ఇప్పటి వరకు ఇంటి స్థలం ఇవ్వలేదు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి పాలక పార్టీలు పేదల జీవిత అవసరాలను పాచికలుగా వాడుకుంటున్నాయి. అధికారంలోకి రావడానికి సంక్షేమ పథకాలను రహదారిగా ఎంచుకుంటున్నాయి. గద్దెనెక్కిన తర్వాత వాటిని అమలు చేస్తున్నట్లు నటిస్తూ, కోతలు పెడుతున్నాయి. హామీల అమలును ప్రశ్నించడం ప్రజల్లో పెరిగిన వెంటనే నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. విధానాల వల్ల వస్తున్న సమస్యలు...పాలకులు మారడం ద్వారా పరిష్కారం కావు, విధానాలే మారాలి. అందుకు ప్రజాచైతన్యమే పరిష్కారం.

/వ్యాసకర్త : సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు /

ఎల్ఐసిని బలోపేతం చేయండి

సందర్భం

జనవరి 19 ఎల్ఐసి ఉద్యోగులకు అత్యంత ముఖ్యమైన రోజు. 1956లో ఇదే రోజున, ప్రజల పొదుపును దోచుకోవడంలో మునిగి తేలుతున్న మొత్తం 245 ప్రైవేట్ బీమా కంపెనీలను విలీనం చేస్తూ జీవిత బీమా (అత్యవసర నిబంధనలు) ఆర్డినెన్స్‌ను ప్రకటించారు అప్పటి ఆర్థిక మంత్రి సి.డి. దేశ్‌ముఖ్. జీవిత బీమా వ్యాపార జాతీయీకరణ అనేది స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో జాతీయ స్పృహలో అంతర్భాగంగా ఉంది. "ప్రజల సంక్షేమం కోసం ప్రజల సొమ్ము" అనే నినాదంతో వ్యక్తితో పాటు దేశానికి కూడా సేవ చేయడమే లక్ష్యం. ఎల్ఐసి దశాబ్దాలుగా స్థిరంగా, అద్భుతంగా ఈ పునాది లక్ష్యాలను నెరవేరుస్తోంది. ప్రభుత్వ సామాజిక-రంగ బాధ్యతలు నెరవేర్చడంలోనేగాక...భారత ఆర్థిక వ్యవస్థపై ఎల్ఐసి తనదైన శాశ్వత ముద్ర వేయడం ద్వారా దేశ అభివృద్ధి కార్యక్రమం నుండి ఒక అవిభాజ్య అంగంగా మారింది.

1956లో కేవలం రూ.5 కోట్ల ప్రారంభ మూలధనంతో మొదలైన ఎల్ఐసి ఇప్పుడు రూ.42,30,617 కోట్ల ఆస్తిని కలిగి ఉంది. రూ.37,35,760 కోట్ల మేర లైఫ్ ఫండ్ ఉంది. రూ.1,43,938 కోట్ల నూతన వ్యాపార ప్రీమియం ఆదాయాన్ని వసూలు చేయడం ద్వారా ఎల్ఐసి పెన్షన్ మరియు గ్రూప్ సూపర్ యాన్యుయేషన్ వ్యాపారం మూడు సంవత్సరాల పాటు ఒక ట్రిలియన్ మార్కును దాటింది. 2021-22 సంవత్సరంలో ఎల్ఐసి 2.18 కోట్ల కొత్త పాలసీలను విక్రయించి 3.56 శాతం వృద్ధిని నమోదు చేసింది. మొదటి సంవత్సరం ప్రీమియంగా రూ.1,98,760 కోట్లు వసూలు చేసింది. నేడు ప్రపంచ వ్యాప్తంగా 14 దేశాల్లో ఎల్ఐసికి తనదైన ముద్ర ఉంది. బీమా పరిశ్రమలో ఎల్ఐసికి అత్యధిక మార్కెట్ వాటా ఉంది. 2021-22 సంవత్సరానికి మొత్తం ఆదాయం రూ.7,21,103 కోట్లు. ఇది రూ.1.92 లక్షల కోట్ల క్లెయిమ్‌లను పరిష్కరించింది.

సర్వీస్ చేయబడిన పాలసీల సంఖ్య పరంగా, సెటిల్ చేయబడిన క్లెయిమ్‌ల పరంగా చూసినట్లయితే ఎల్ఐసి



నేడు జీవిత బీమా జాతీయీకరణ దినోత్సవం

ప్రపంచంలోనే ఒక అతి పెద్ద బీమా సంస్థ. ఎల్ఐసి భారతదేశంలో అత్యధిక ఆస్తులు కలిగిన అతి పెద్ద సంస్థ. ఎల్ఐసి ఆస్తులు అనేక దేశాల జిడిపి ని మించి పోయాయి. 30 కోట్లకు పైగా పాలసీదారులతో ఇది కోట్లాదిమంది భారతీయ కుటుంబాలను చేరింది. ఏటా రూ.4-5 లక్షల కోట్ల మొత్తాన్ని పెట్టుబడి మిగులుగా సమకూరు స్తోంది. సంస్థ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రభుత్వానికి డివిడెండ్‌గా రూ.31,000 కోట్లకు పైగా మొత్తాన్ని చెల్లించింది.

ప్రభుత్వం మరియు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ ప్రతికూల విధానాల కారణంగా బీమా పరిశ్రమ నేడు అనేక సవాళ్ళను ఎదుర్కొంటోంది. దురదృష్టకర విషయం ఏమిటంటే ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చినా... ఎల్ఐసి ఐపిఓ ద్వారా స్టాక్ మార్కెట్‌లో ప్రభుత్వం తన వాటాలో 3.5 శాతం మేర విక్రయించడంతో పునాది లక్ష్యాలకు తీవ్ర విఘాతం కలిగింది. ఎల్ఐసి తో ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయించే విధంగా చర్యలు చేపడుతోంది. లైసెన్సుల జారీలో, మూలధన అవసరాలలో, ఏజెన్సీ నిబంధనలు, బ్యాంక్ ఎష్యూరెన్స్, కార్పొరేట్ ఏజెన్సీ మోడల్స్ మరియు పెట్టుబడులు మొదలైన అంశాలపై మార్పులను తీసుకురావడానికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ ప్రయత్నిస్తోంది. వీటిని అమలు చేస్తే బీమా పరిశ్రమను 1956కి ముందు పరిస్థితులకు తీసుకువెళ్లే ప్రమాదం ఉంది. పాలసీదారుల డబ్బును, భద్రతను పణంగా పెట్టే కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అందువల్ల జనవరి 19 అనేది ఒక నమ్మకాన్ని, ఒక భరోసాను కలిగించేది. మన నమ్మకాలను, నిబద్ధతను దృఢపరిచే రోజు. ప్రభుత్వ రంగంలో ఎల్ఐసిని రక్షించడానికి కొత్త శక్తితో, నూతనోత్సాహంతో, ముందుకు సాగడానికి స్ఫూర్తిని కలిగించే ఒక మంచి రోజు.

బిజెపి ప్రభుత్వ రంగానికి వ్యతిరేకమని, ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి గతంలో ప్రభుత్వ రంగంపై అనేక సార్లు విషం చిమ్మారనేది రహస్యమేమీ కాదు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడం దేశ ఆర్థిక సార్వభౌమత్వానికి చేటు. కానీ, ప్రైవేటీకరణకు ఈ ప్రభుత్వం హాల్‌మార్క్‌గా మారింది. మానిటైజేషన్ లేదా ప్రజల ఆస్తుల అమ్మకం ద్వారా ప్రభుత్వం తన ఆదాయాన్ని సంపాదించడానికి ఏకైక మార్గంగా అవలంబిస్తోంది.

ఈ నేపథ్యంలో జీవిత బీమా రంగ జాతీయీకరణ దినోత్సవాన (జనవరి 19) "ప్రభుత్వ రంగాన్ని కాపాడండి- ఎల్ఐసిని బలోపేతం చేయండి" నినాదంతో ఉద్యమించడం అత్యంత సముచితం.

ప్రభుత్వ రంగ ఎల్ఐసి కి పాలసీదారుల నమ్మకం, ఏజెంట్లు, ఉద్యోగుల శ్రమ అత్యంత కీలకమైనవి. గతంలో అనేక సందర్భాలలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని తన ప్రతిభను నిరూపించిన ఎల్ఐసి ఆఫ్ ఇండియా ...ప్రైవేటు రంగానికి ఎక్కువ చేయూతనిచ్చే ప్రభుత్వ విధానాలను సైతం తోసిపుచ్చి...ముందుకు సాగే శక్తిని కలిగి ఉండడం భారతదేశానికి గర్వకారణం. ప్రభుత్వ రంగ ఎల్ఐసికి తోడ్పాటునందిస్తున్న వారందరూ అభినందనీయులే.

- చిలకలపూడి కళాధర్,
సంయుక్త కార్యదర్శి ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్,
సెల్ : 7382099838

నివాళి


ప్రజాకవి వేమన

మతములందలి అపవాదములను, మూఢనమ్మకాలను ఎత్తి చూపి నిజాన్ని మన ముందు ప్రతిబింబించిన హేతువాది, సామాజిక విప్లవకారుడు యోగి వేమన. పండిత లోకానికే పరిమితమైన వేదాంతాన్ని పామరులకు కూడా అర్థమయ్యేలా సరళమైన పదాలతో స్వచ్ఛమైన అచ్చమైన తేనె లాంటి తేట తెలుగు పద్యాలలో వివరించిన మహానుభావుడు వేమన.

సి.పి.బ్రౌన్ పరిశోధన ప్రకారం వేమన 1652వ సంవత్సరంలో కడప జిల్లా లోని ఒక చిన్న పల్లెలో జన్మించినట్లు తెలుస్తుంది. ఇప్పటికీ పండిత, పామర భేదం లేకుండా వేమన పద్యాలు వినని తెలుగు వారు లేరంటే అతిశయోక్తి కాదేమో. అంతగా ఆయన పద్యాలు జనబాహుళ్యం లోకి చొచ్చుకుపోయాయి. ఆయన రాసిన ప్రతి పద్యం ఒక ఆణిముత్యమే. మన వేమన...మంచి కోసం, మార్పు కోసం, మన కోసం ప్రశ్నించి, ప్రతిస్పందించి, ప్రతిధ్వనించాడు. వేమన పద్యాలు లోక నీతులు. సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం. వేమన స్పృశించని అంశం లేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించాడు. కుటుంబ వ్యవస్థ లోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించడం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి కనిపించిన ప్రతి సామాజిక అస్తవ్యస్థత మీద వేమన తన పద్యాన్ని ఎక్కుపెట్టాడు.

అంతటి మహానుభావుడి పద్య చరితను మన తెలుగు వారికి అందజేసింది మాత్రం ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్. 'హిందువుల ఆచారాలు పండుగలు' అనే గ్రంథాన్ని చదువుతున్న సమయంలో కొన్ని వేమన పద్యాలు చదివి వాటికి ఆకర్షితుడయ్యాడు సి.పి. బ్రౌన్. ఆ ఆకర్షణ లోని తీక్షణతే వేలకొలది వేమన పద్యాలను సేకరించేలా చేసింది. వేమన వేదాంత విషయాలను చెప్పడానికి కందాలను, తేటగీతులను ఎక్కువగా ఎంచుకున్నాడు. ఆటవెలదులను ఎక్కువగా లోక సంబంధమైన పద్యాలకు ఎన్నుకొన్నాడు. వేమన చెప్పిన కంద, తేటగీతి పద్యాల భావములు మతవాదుల చట్రములలో ఇమడక పోవటం వల్ల, వాటి నిగూఢ భావములు వారికి అంతుచిక్కక పోవటం వల్ల, ఆ పద్యాలు వేమన చెప్పినవి కావని వారు భావిస్తున్నారు. కాని బ్రౌన్ వాటిని వున్నవున్నట్లు తన సంకలన గ్రంథంలో ప్రచురించాడు. వేమన పద్యాలు రెండవ ఎడిషను కూడా అచ్చు వేయించాడు. 1845లో మద్రాస్ లిటరసీ సొసైటీకి తన స్వంత ధనంతో సంపాదించిన 2440 రాతప్రతులను కానుకగా ఇచ్చాడు.

బ్రౌను దొర వేమన పద్యాలను ప్రచురించడమన్నది ఆ



రోజుల్లో చాలామంది పండితులకు నచ్చక ఆయనను వ్యతిరేకించారు. అందుకుగల కారణం హిందూ మతంలోని లోపాలను ఎత్తిచూపడమే. సంఘసంస్కరణను కోరిన వేమనను గురించి మనం తప్పక స్మరించుకోవాలి.

వేమన కాలం, పుట్టిన ప్రదేశం గురించి పండితుల మధ్య తర్జన భర్జనలు నేటికీ జరుగుతున్నాయి. వేమన కాలం గురించీ, జీవితం గురించీ సి.పి. బ్రౌన్, తరువాత మరికొంతమంది అధ్యయనం చేశారు. వంగూరి సుబ్బారావు, వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రి, బండారు తమ్మయ్య, ఆరుద్ర, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, వేమూరి విశ్వనాథ శర్మ, కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి వంటి పండితులు, పరిశోధకులు ఈ విషయంపై వివిధ అభిప్రాయాలు తెలిపారు. వారందరి పరిశోధనల తదుపరి ఆయన జీవిత కాలం గురించి గాని, జీవిత గాథ గురించి గాని ఏకాభిప్రాయం ఇప్పటివరకూ లభించలేదు. 1652-1730 మధ్య జీవించిన వేమనలా తెలుగువారి గుండెల్లో పలికిన ప్రజా కవి మరొకరు లేరనే చెప్పాలి. ఇన్నేళ్ళు గడిచినా మన నాలుకల మీద నాట్యమాడుతున్న మన వే"మన" పద్యాలే అందుకు సాక్షి. విశ్వదాభిరామ వినురవేమ అనే మాట వినని, ఒక్క వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరని లోకోక్తి.

- రేగుళ్ళ మల్లికార్జున రావు,
భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు,
సెల్ : 9491659899

2002 గుజరాత్ అల్లర్లు

మోడీదే ప్రధాన బాధ్యత

- ఆనాటి ఊచకోత రాజకీయ ప్రేరేపితం
- ఒక వర్గం వారిపై హిందూత్వ శక్తుల్ని ఉసిగొల్పి...పోలీసులను ఆపారు
- అల్లర్లకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రణాళిక : బ్రిటీష్ ప్రభుత్వ విచారణ బృందం నివేదిక
- నివేదికలోని ముఖ్యాంశాలతో బిబిసి డాక్యుమెంటరీ ప్రసారం



లండన్ : 2002 గుజరాత్ అల్లర్లకు ప్రధాన బాధ్యుడు ఆనాటి రాష్ట్ర సిఎంగా ఉన్న నరేంద్రమోడీ...అని బ్రిటిష్ ప్రభుత్వ విచారణ బృందం తేల్చింది. అంతేకాదు, ఊచకోతకు, అల్లర్లకు పాల్పడిన హిందుత్వ శక్తులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించిందని, ఏం చేసినా పోలీసులు అడ్డుకోరనే సంకేతాలు పంపినందువల్లే దారుణాలు జరిగాయని విచారణ బృందం నిర్ధారించింది. విచారణ బృందం నివేదికలోని ముఖ్యాంశాల్ని చూపుతూ మంగళవారం బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారం చేసింది. దీంతో గుజరాత్ అల్లర్ల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. 'ద మోడీ క్వశ్చన్' అనే పేరుతో డాక్యుమెంటరీ ప్రసారమైంది. విచారణ బృందంలోని సభ్యుడైన ఒక మాజీ దౌత్యవేత్త మాట్లాడుతూ, "విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అల్లర్లకు ప్రణాళికలు వేశాయి" అని చెప్పారు. మోడీ ప్రభుత్వం నుంచి లభించిన పోలీస్ రక్షణతోనే వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లు చెలరేగిపోయాయని, అమాయక పౌరులపై దాడులకు తెగబడ్డాయని నివేదిక స్పష్టంగా పేర్కొంది. విచారణ బృందం నివేదిక బ్రిటన్ ప్రభుత్వానికి చేరిందని, ఇందులోని విషయాలేవీ ఇప్పటివరకూ బయటకు రాలేదని డాక్యుమెంటరీ పేర్కొంది. బుధవారం వెబ్‌సైట్ నుంచి డాక్యుమెంటరీని బీబీసీ తొలగించింది.

గోద్రా రైలు దగ్ధంలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు చనిపోవటంతో 2002 ఫిబ్రవరి-మార్చి మధ్యకాలంలో గుజరాత్ అంతటా మైనార్టీ ముస్లింలపై దాడులు మొదలయ్యాయి. అల్లర్లలో 790మంది ముస్లింలు, 254మంది హిందువులు చనిపోయారని అధికారిక నివేదికలో గుజరాత్ ప్రభుత్వం పేర్కొంది. మత ఘర్షణల్ని గుజరాత్ ప్రభుత్వం అరికట్టలేదన్న ఆరోపణల్ని సిఎంగా నరేంద్రమోడీ తిరస్కరించారు. అయితే తాజాగా బహిర్గతమైన బ్రిటిష్ ప్రభుత్వ విచారణ నివేదిక మాత్రం అల్లర్లకు ప్రధాన బాధ్యుడు నరేంద్రమోడీయేనని ఆరోపించింది. గుజరాత్ పోలీస్ రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకోకుండా ఆయనే అడ్డుకున్నారని విచారణ నివేదిక పేర్కొంది. ఈ మొత్తం ఘటనపై ప్రత్యేక విచారణ బృందాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేయగా, సరైన సాక్ష్యాధారాలు లేవని మోడీ, మరో 63మందికి క్లీన్‌చిట్ లభించింది. సిట్ నివేదికను 2013లో సుప్రీం ఆమోదించింది. అయితే పోలీసులు రంగంలోకి దిగకుండా నరేంద్ర మోడీ అడ్డుకున్నారనేందుకు ఆధారాలున్నాయని బ్రిటిష్ ప్రభుత్వ నివేదిక ఆరోపించటం గమనార్హం.

బయటకు తెలిసింది కొంతే

గుజరాత్ 2002 అల్లర్లు రాజకీయ ప్రేరేపితం. ఇందులో లక్ష్యం సుస్పష్టం. హిందువులు మెజార్టీగా ఉన్న ప్రాంతాల్లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఊచకోత సాగించారు. ఈ ఊచకోతలో బలైన వారి వివరాలన్నీ బయటకు రాలేదు. మీడియాలో, ఇతర మార్గాల్లో బయటకు తెలిసినదానికంటే ఎక్కువగా క్షేత్రస్థాయిలో ఊచకోత సాగిందని డాక్యుమెంటరీ తెలిపింది. ఒక వర్గానికి చెందినవారిని ప్రణాళిక ప్రకారం చంపారని, లైంగికదాడులు ఎక్కువ సంఖ్యలో జరిగాయని పేర్కొంది. ప్రధాని మోడీపై గుజరాత్ అల్లర్లు ఒక మాయని మచ్చ...అని బ్రిటిష్ మాజీ విదేశాంగ కార్యదర్శి జాక్ స్ట్రా ఆరోపించారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవని అన్నారు. సిఎంగా ఉన్న మోడీ ఆనాడు హిందుత్వ శక్తులను ఉసిగొల్పి, మరోవైపు పోలీసు చేతులు కట్టేశారని చెప్పారు. ఈ ఆరోపణల కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం 2005 నుంచి 2014 వరకు మోడీకి వీసా నిరాకరించింది.

బ్రిజ్ భూషణ్‌కో హఠావో..

- జంతర్‌మంతర్ వద్ద స్టార్ రెజ్లర్ల ఆందోళన



న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణం తొలగించాలంటూ జంతర్ మంతర్ వద్ద మహిళా రెజ్లర్లు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో వినేశ్ ఫోగాట్, సాక్షిమాలిక్, సంగీతా ఫొగాట్, సోనమ్ మాలిక్, సరిత మోర్, అన్షు భజరంగ్ పునియాతోపాటు 30మంది స్టార్ రెజ్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినేశ్ మీడియాతో మాట్లాడుతూ.. బ్రిజేశ్, కోచ్‌ల లైంగిక వేధింపులు తట్టుకోలేక తాను ఓసారి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా, ఎందుకు పనికిరావని ఎంతో మానసిక క్షోభకు గురి చేసేవారంటూ కన్నీళ్లు పెట్టుకుంది. జాతీయ శిబిరాల్లో ఎన్నో ఏళ్ల తరబడి కొనసాగుతున్న కొందరు కోచ్‌లు మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్నారని, అందులో బ్రిజ్ భూషణ్ శరణ్ కూడా ఒకరని తెలిపారు. చాలామంది యువ రెజ్లర్లు తనవద్దకు వచ్చి ఏడ్చారని, తనకు తెలిసినంతవరకు 20మంది బాలికలు జాతీయ శిబిరంలో లైంగిక వేధింపులకు గురౌతున్నట్లు తెలిపారని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ విషయాన్ని ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక బాధపడేవారని, ఎవరికైనా ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకునేవారు కాదని ఆమె తెలిపారు. తమ గాయాల గురించి అస్సలు పట్టించుకోరని, వారిపై ఫిర్యాదు చేసినందుకు వెళ్తే... చంపేస్తామంటూ బెదిరింపులు కూడా వచ్చాయి" అంటూ ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. బ్రిజ్ భూషణ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగించేవరకు తాము ధర్నా కొనసాగిస్తామని, అప్పటిదాకా ఏ అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొనబోమని స్పష్టం చేశారు. 2011 నుంచి బ్రిజ్ భూషణ్ రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2019లో వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రెజ్లర్లను కొట్టేవారు: భజరంగ్ పూనియా

స్టార్ రెజ్లర్ భజరంగ్ పూనియా మాట్లాడుతూ.. "ఫెడరేషన్‌లో ఉన్నవారికి ఆట గురించి ఏ మాత్రం తెలియదని, రెజ్లర్లను వారు చాలా వేధిస్తున్నారని తెలిపారు. బ్రిజ్ భూషణ్ మమ్మల్ని తిట్టేవారు, కొట్టేవారు కూడా. మా పోరాటం ప్రభుత్వం, 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా'పై కాదు. కేవలం రెజ్లింగ్ ఫెడరేషన్‌పైనే" అని చెప్పారు.

లంచం ఇచ్చారంటూ ఆప్ ఎమ్మెల్యే ప్రకటన

న్యూఢిల్లీ : ఆప్ ఎమ్మెల్యే మహేందర్ గోయల్ బుధవారం ఢిల్లీ అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని, తనకు భద్రత కల్పించాలని గోయల్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం సభ ప్రారంభం కాగానే.. గోయల్ తన వద్ద ఉన్న నోట్ల కట్టలను చూపి ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్ తనకు లంచం ఇచ్చారని అన్నారు. రోహిణీలోని బాబా సాహెబ్ అంబేద్కర్ హాస్పిటల్‌లో తాత్కాలిక సిబ్బంది నియామకంలో అవకతవకలు జరిగాయని.. లంచంతో తన నోరు నొక్కాలని చూశారని అన్నారు. ఆ 'బలవంతుల' చేతుల్లో తనకు ప్రాణ హాని ఉందని చెప్పారు. అయితే ఈ బెదిరింపులకు తాను లొంగనని, ఆ ప్రైవేట్ కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అది సామ్రాజ్యవాద యుద్ధమే

- కార్మికులకు తీవ్ర నష్టం
- డబ్ల్యూఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిర్టిసిస్

శామ్యూల్ చక్రవర్తి నగర్ నుండి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

సామ్రాజ్యవాద కాంక్షలో భాగంగానే రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం జరుగుతోందని రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం సామ్రాజ్యవాద కాంక్షలో భాగమేనని, దీని ప్రభావంతో కార్మికలోకానికి తీవ్ర నష్టం కలుగుతోందని డబ్ల్యుఎఫ్‌టియు (వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ (ట్రేడ్ యూనియన్స్) ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిర్టిసిస్ అన్నారు. సిఐటియు 17వ మహాసభ ప్రతినిధుల సభ బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. కామ్రేడ్ రంజనా నిరూల్, రఘునాథ్ సింగ్ వేదికగా జరుగుతున్న ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఈ యుద్ధాన్ని సాకుగా చూపి ఇతర దేశాలపై అమెరికా విధించిన ఆంక్షల ప్రభావం కార్మికులపై తీవ్రంగా పడుతోందన్నారు. యుద్ధాలు సామ్రాజ్య కాంక్షలో భాగంగానే సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇవి కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మిక లోకాన్ని ఏకంచేసి పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాటంలోకి తీసుకురావడమే ఈ సమస్యకు పరిష్కారమని చెప్పారు.

మరింత ఉధృతంగా పోరాటాలు

- సిఐటియు మహాసభలో వివిధ సంఘాల నేతలు

ఫాసిస్టు, మతతత్వ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే కార్మిక ఐక్యపోరాటాలను మరింత ఉధృతం చేయాలని వివిధ ట్రేడ్ యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. బెంగళూరు నగరంలోని శామ్యూల్ చక్రవర్తి నగర్‌లో బుధవారం ప్రారంభమైన సిఐటియు 17వ మహాసభలో వివిధ సంఘాల నాయకులు సౌహార్ద సందేశమిచ్చారు. సిఐటియు అధ్యక్షురాలు హేమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, ఎఐయుటియుసి, టియుసిసి, యుటియుసి, సేవా, ఎఐసిసిటియు, ఎపిఎఫ్ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభం కుదిపేస్తోందన్నారు. నిరుద్యోగం, నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. అందుకు తగ్గట్టు కార్మికుల వేతనాల్లో పెరుగుదల లేకపోవడం శోచనీయమన్నారు. భారతదేశంలో ఈ సంక్షోభం మరింత తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న ఆత్మహత్యల్లో 25 శాతం దినసరి కార్మికులవే ఉంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. మరోవైపు పెట్టుబడిదారుల సంపద పెరుగుతూపోతోందన్నారు. ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు ఆర్.చంద్రశేఖరన్ మాట్లాడుతూ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరిస్తోందన్నారు. కాంట్రాక్టు, ప్రయి వేటీకరణ విధానాలను మరింత వేగవంతంగా చేపడుతోందన్నారు. కార్మిక సమస్యలపై బిఎంఎస్ మొదలుకుని అన్ని సంఘాలు మాట్లాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎఐటియుసి అధ్యక్షుడు సోమశేఖర్ మాట్లాడుతూ దేశంలో రైతాంగ పోరాటం ఒక స్ఫూర్తిదాయకమన్నారు. ఏడాదిపాటు వీరోచిత పోరాటం సాగించి మూడు నల్లచట్టాలను తిప్పికొట్టారని పేర్కొన్నారు. అటువంటి పోరాటాన్నే కార్మిక వర్గం కూడాచేపట్టి లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టాల్సిన అవసరమందన్నారు. టియుసిసి జాతీయ కార్యదర్శి రాజేంద్రనాయర్ మాట్లాడుతూ ఆర్థిక విధానాల మూలంగానే కార్మికులకు నష్టం జరుగుతోందన్నారు.

దేశంలో 50 కోట్ల మంది ఉత్పాదక రంగంలో పనిచేస్తున్నారన్నారు. వారి ఇబ్బందులను పట్టించుకునే పరిస్థితుల్లో పాలకుల్లేరని చెప్పారు. సేవా నాయకులు సానియా జార్జ్ మాట్లాడుతూ ఉత్పాదక వ్యవస్థలో మహిళల పాత్ర చాలా కీలకమన్నారు. అయితే వారి వేతనాల్లో మరంత దయనీయ పరిస్థితి ఉందన్నారు. ఎఐసిసిటియు కార్యదర్శి క్లిఫ్టన్ మట్లాడుతూ దేశంలో కార్మిక పోరాటాల్లో పాల్గొంటున్న వారిపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. పోరాటాల్లో పాల్గొనే వారిపై కేసులు నమోదు చేసి జైళ్లలో పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌పిఎఫ్ కార్యదర్శి వి.వేలుస్వామి, హెచ్‌ఎంఎస్ నాయకులు నాగనాథ్ తదితరులు మాట్లాడారు. ఐక్య పోరాటాల ఆవశ్యకతను తెలియజేశారు. డబ్లుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పంబిస్ కిరిటిసిస్, సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అధికారులకు జైలు శిక్ష

- క్షమాపణలతో రద్దు
- పనివేళలు ముగిసే వరకు కోర్టులోనే ఉండాలని తీర్పు సవరణ
- సింగిల్ జడ్జి తీర్పును నిలుపుదల చేసిన డివిజన్ బెంచ్

ప్రజాశక్తి, అమరావతి

కోర్టు ధిక్కార కేసులో ఇద్దరు ఉన్నతాధికారులకు హైకోర్టు నెల రోజుల జైలు శిక్ష విధించింది. అయితే, ఆ ఇద్దరు అధికారులు బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో జైలు శిక్షను హైకోర్టు రద్దు చేసింది. కోర్టు పని వేళలు అయ్యే వరకు కోర్టులోనే ఉండాలంటూ తీర్పును సవరించింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదన్న కేసులో పాఠశాల విద్యాశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, ఇంటర్మీడియట్ విద్యా శాఖ గత కమిషనర్ వి.రామకష్ణలకు న్యాయమూర్తి జస్టిస్ బి.దేవానంద్ బుధవారం జైలు శిక్ష విధించారు. వారు క్షమాపణలు కోరడంతో జైలుశిక్ష ఉత్తర్వులను సవరించి కోర్టు పని గంటలు ముగిసే వరకు కోర్టులోనే ఉండాలని ఆదేశాలిచ్చారు. వెయ్యి రూపాయల జరిమానా కూడా విధించారు. తీర్పు అమలులో భాగంగా తుళ్లూరు పోలీసులు వచ్చిన వారిని రిమాండ్‌కు తరలించాలని ఆదేశించారు. తీర్పు అమలును రెండు రోజులపాటు వాయిదా వేయాలని వారి తరపు న్యాయవాది చేసిన వినతిని న్యాయమూర్తి తోసిపుచ్చారు. ఇద్దరు సదుద్దేశంతో క్షమాపణలు చెబుతున్నట్లుగా లేదని న్యాయమూర్తి అన్నారు. దీంతో ఇద్దరు అధికారులు రెండోసారి క్షమాపణలు చెప్పారు. దీంతో వారిద్దరి ఆరోగ్య పరిస్థితుల దష్ట్యా జైలు శిక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి ఇద్దరూ కోర్టు పని వేళలు పూర్తి అయ్యే వరకు కోర్టుహాల్లోనే ఉండాలని ఇద్దరినీ ఆదేశించారు. ఈ ఉత్తర్వులను ఇద్దరు అధికారులు డివిజన్ బెంచ్ ఎదుట అప్పీల్ దాఖలు చేశారు. అప్పీళ్లను జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం జరిగిందని, కోర్టులో ఉండాలని ఆదేశించడం కూడా శిక్ష విధింపు కిందకే వస్తుందని వారి తరఫు ప్రభుత్వ న్యాయవాది సుమన్ చెప్పారు. సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును డివిజన్ బెంచ్ నిలుపుదల చేస్తూ ఉత్తర్వుల జారీ చేసింది.

నేపాల్ విమాన ప్రమాదంలో 71 మృతదేహాలు వెలికితీత

ఖాట్మండు : నేపాల్‌లో ఈ నెల 15న అత్యంత ఘోర విమాన ప్రమాదంలో 72 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ 72 మృత దేహాల్లో 68 మృత దేహాలను ఆ ఘటన జరిగిన (ఆదివారం) రోజునే రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. ఆ తర్వాతిరోజు మరో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. తాజాగా బుధవారం మరో మృతదేహాన్ని రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. దీంతో వెలికితీసిన మృతదేహాల సంఖ్య 71కి చేరింది. మరో మృతదేహం కోసం రెస్క్యూ సిబ్బంది ప్రమాదం జరిగిన ప్రాంతాన్నంతా గాలిస్తున్నారని నేపాల్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఆదివారం రోజు యతి ఎయిర్‌లైన్స్ విమానం పోఖారా నగరంలో నూతనంగా ప్రారంభించిన విమానాశ్రయంలో మరో ఐదు నిమిషాల్లో ల్యాండ్ అవబోతుండగా నది లోయలో కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో విమానంలోని రెండు బ్లాక్ బాక్స్‌లను నేపాల్ పౌర విమానయాన సంస్థకి అందజేసినట్లు యతి ఎయిర్‌లైన్స్ ప్రతినిధి సుదర్శన్ బర్తాలా వెల్లడించారు.

బిజెపిలో చేరిన పంజాబ్ కాంగ్రెస్ నేత

చండీఘడ్ : పంజాబ్ మాజీ ఆర్థిక మంత్రి మన్‌ప్రీత్ సింగ్ బాదల్ కాంగ్రెస్ నుండి బయటకు వచ్చిన కొద్ది గంటల్లోనే బిజెపిలో చేరారు. పంజాబ్ పట్ల కాంగ్రెస్ వైఖరి నిరాశ కలిగించేలా వుందని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకత్వంలో ముఠా కుమ్ములాటలు పెరిగిపోతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో బిజెపి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాదల్ బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, పార్టీ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ పాల్గొన్నారు. 1995లో తొలుత శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఎడి)లో చేరిన ఆయన ఆ తర్వాత స్వంత పార్టీని స్థాపించారు. తర్వాత ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. తాజాగా బిజెపిలో చేరారు. అమిత్ షాతో సమావేశానంతరమే తాను బిజెపిలో చేరినట్లు బాదల్ చెప్పారు.

బిజెపి ఓటమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు కెసిఆర్ అన్నారు. ప్రజల ఆస్తులను ప్రజలపరం చేయడమే బిఆర్ఎస్ లక్ష్యమని తెలిపారు. దేశం వెనకబాటుతనానికి బిజెపి, కాంగ్రెస్ పార్టీలే కారణమన్నారు. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, ఇలా అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకే కులం, మతం పేరుతో వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ కానీ బిఆర్ఎస్ ప్రతిపాదించే ప్రభుత్వం కానీ అధికారంలోకొస్తే దేశంలో రైతులందరికీ ఉచిత విద్యుత్తు, రైతుబంధు అమలు చేస్తామని, దళితులందరికీ దళిత బంధు, ఇంటింటికీ సురక్షిత మంచినీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. అగ్నిపథ్‌ను రద్దు చేసి పాత విధానం కొనసాగిస్తామన్నారు. విద్యుత్తు సంస్థలను, ఎల్ఐసిని ప్రయివేటుపరం చేయబోమని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కును మోడీ అమ్మేసినా తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. బిజెపి పాలసీ ప్రయివేటైజేషన్ అయితే... బిఆర్ఎస్ పాలసీ నేషనలైజేషన్ అని తెలిపారు. జాతీయ స్థాయిలో వామపక్ష పార్టీలతో కలిసి పనిచేస్తామని, విజయం మనదే అని కెసిఆర్ ప్రకటించారు. బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఖమ్మం కలెక్టరేట్ భవన నూతన సముదాయాన్ని కెసిఆర్, పినరయి విజయన్ ప్రారంభించారు.





మీకోసం

కొన్ని ఎండుద్రాక్ష (కిస్‌మిస్)లను రాత్రంతా నీటిలో నానబెట్టి ఉదయాన్నే తింటే మలబద్ధక సమస్య తగ్గుతుంది.

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా లేక వినకుండా సాగిపోవడమా అనేది మనం వేసే అడుగులోనే ఉంటుంది.

JEEVANA జీవన the family

గాంధీమార్గం



రాజు రాణి నేస్తాలు!
పనిలో కలిపిరి హస్తాలు!


మొక్క మొక్క నాటారు!
పచ్చదనాన్ని పెంచారు!
చేయి చేయి కలిపారు!
వీధులు శుభ్రం చేసారు !

పనిలో ఉన్న బాలలను
విధిగా బడిలో చేర్చారు!
చిట్టిగురువులుగా మారి
అక్షరాస్యతను పెంచారు !

పేదరికం అవిద్య పై
సతతము పోరు చేసారు!
గ్రామాలన్నీ ప్రగతి చెందుటకు
గాంధీమార్గం శరణన్నారు!

- రావిపల్లి వాసుదేవరావు
94417 13136

దారి చూపండి



చిన్నారులూ, ఇక్కడ కప్ప బయటకు వచ్చింది. తిరిగి దాని నివాసానికి చేరుకోటానికి దారి చూపి సాయం చేయరూ.

నేను గీసిన బొమ్మ



- వి. దీపిక,
7 వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి, చిత్తూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



తల్లులకు బాసటగా ...

ఆడపిల్ల అత్తింటికి వెళ్లాక ఇంటిసభ్యులతో మనసులో మాట పంచుకునేందుకు, ఇంటి పక్కవారితో పరిచయం పెంచుకునేందు కొంత సమయం పడుతుంది. భర్త పనికి వెళితే...తిరిగి వచ్చే వరకూ ఒంటరిగానే ఫీలవుతుంది. ఇది ఒకరకంగా మానసిక ఒత్తిడే. బిడ్డ పుట్టాక శరీరంలో, జీవనశైలిలో మార్పు ఆమెను మరింత కుంగదీస్తుంది. వీటి నుంచి ఎలా బయటపడాలో చాలామంది ఆడవాళ్లకు తెలియదు. అటువంటి వారికోసమే 'బేబీ బ్లూస్' స్థాపించారు ప్రియాంక కపూర్. మహిళలు కుటుంబం కోసమే కాకుండా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో ఫిట్‌నెస్‌లో శిక్షణ, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పది మంది మహిళలతో ప్రారంభించిన తన సంస్థలో ఇప్పుడు ఐదు వేలమంది చేరారు.



ఢిల్లీకి చెందిన ప్రియాంక 23 ఏళ్ల వయసులో పెళ్లి అయ్యింది. కొన్ని రోజులకు వడోదర నగరంలో భర్తతో కాపురం పెట్టారు. కొత్త ప్రదేశం, ఇంటి పక్కన పరిచయాలు ఏర్పడలేదు. దాంతో భర్త పనికి వెళ్లాక ఆమె ఒంటరినని ఫీలయ్యేది. భర్త ఇంటికి వచ్చేవరకూ ఎవరితోనూ మాట్లాడేది కాదు. కుటుంబసభ్యులతో ఫోన్లో మాట్లాడినా ఆమెకు ఊరటనిచ్చేది కాదు. దాన్నుంచి బయటపడేందుకు ఏదైనా పనిలో నిమగ్నమౌదామని ప్రయత్నించి విఫలమయ్యింది. తన జీవితంలో ఈ పెను మార్పుని త్వరగా స్వీకరించలేకపోయింది. అందరినీ తలచుకుంటూ ప్రతిరోజూ ఏడ్చేది. రోజుల తరబడి ఏకాంతాన్ని అనుభవించడం ఆమెను మానసికంగా బాధించింది. తెలియకుండా డిప్రెషన్‌కు గురైంది. దాంతో రుతుక్రమ సమస్యలూ తలెత్తాయి. పెళ్లైన ఏడాది తర్వాత 'పిల్లలు లేరా?.. చూపించుకోండి...' అంటూ బంధువులు, తెలిసిన వారూ అనటం ఆమెను మరింత ఒత్తిడికి గురిచేసింది. వీటన్నిటి నుంచి బయటపడేందుకు ఉద్యోగంలో చేరింది. పదిమందితో కలిసి పనిచేయడం, నిత్యం జనంలో ఉండటం ఆమె ప్రవర్తనలో, ఆలోచనల్లో మార్పు కనిపించింది.

ఐదేళ్ల తర్వాత ఒక బాబు పుట్టాడు. అప్పుడు అమాంతం 10 కేజీల బరువు పెరిగింది. ఆమె రూపం పూర్తిగా మారిపోయింది. బాబు అవసరాలు చూస్తూ తన గురించి పట్టించుకోవడం తగ్గించింది. దాంతో హార్మోన్లు స్థాయి పెరుగుతూ, తగ్గుతూ ఉండటంతో మళ్లీ ఒత్తిడికి గురయింది. పుట్టింట్లో ఉన్నన్నాళ్లు బాగానే ఉంది. తిరిగి భర్త దగ్గరకు వచ్చాకా సమస్య మొదటికి వచ్చింది. మానసిక రుగ్మతలు తలెత్తాయి. దాన్నించి బయట పడేందుకు తాను వర్కట్స్ ప్రారంభించింది. అందుకు తాను చాలా కష్టపడింది. అప్పుడే ఆమెకు ఒక ఆలోచన కలిగింది. తనలా ప్రసవ అనంతరం ఎదురయ్యే సమస్యలు, మోనోపాజ్ నుంచి బయటపడేలా ఆడవాళ్లకు అవగాహన కల్పించాలనుకొంది. ఆ ఆలోచనలో నుంచి పుట్టిందే 'మామ్స్ ఆఫ్ వడోదరా'. ఇలాంటి సమస్య ఉన్న మహిళలను వెతకడం, వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపిలే అవగాహన కల్పించడం ఈ సంస్థ లక్ష్యం.



ప్రియాంక మొదట తన ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టింది. ప్రతిరోజూ ఐదు కిలోమీటర్లు పరుగు



తీస్తూ తనతో పాటు తోటి తల్లులను కూడా ప్రోత్సహించింది. 'బిడ్డ తల్లులందరూ ఈ బాధను భరించాలి. పరుగులు, వ్యాయామం చేసే సమయం మాకు లేదు' అంటూ కొందరు ప్రియాంక మాటలను కొట్టిపారేసేవారు. వారందరికీ అర్థమయ్యేలా చెప్పడమే ఆమె మొదటి సవాలు. ఆన్‌లైన్ వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించింది. దీంతో, మెల్లగా సంస్థలో చేరి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్న తల్లుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. వీరికి నిత్యం అందుబాటులో ఉంటూ ఫిట్‌నెస్‌ను జీవనశైలిలో భాగమయ్యేలా ప్రేరణ కల్పిస్తున్నారు.

తోటి మహిళలకు సహాయం చేయాలన్న ఆసక్తి ఉన్న పది మంది మహిళా సభ్యులతో సంఘం ప్రారంభించారు. నాలుగేళ్లలో ఈ సంఘంలో ఐదు వేలమంది మహిళలు, వృద్ధులు చేరారు. వీరిలో 300 మంది మహిళా రన్నర్లు ఉన్నారు. వీరిలో ఉద్యోగినులు, తల్లులు, గృహిణులు ఉన్నారు. ఏడాది పొడవునా ఫిట్‌నెస్ వర్క్‌షాప్‌ల ఈవెంట్‌లను నిర్వహిస్తారు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి వృద్ధాప్యం వరకూ ఎటువంటి సమస్యలు ఎదురవుతాయి? వాటిని ఎలా ఎదుర్కోవాలి అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. ప్రధానంగా తల్లుల శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యంపై దృష్టి ఉంటుంది. వీరంతా వడోదరలో స్థానికంగా జరిగే రకరకాల క్రీడల్లో పాల్గొంటారు. రుతుక్రమ పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ప్రియాంక ప్రతి సంవత్సరం మహిళా దినోత్సవం రోజున 'రెడ్ శారీ రన్' నిర్వహిస్తుంది.

'నాకు 45 ఏళ్లు. గత కొన్నేళ్లుగా నాకు ఆరోగ్యం బాగోలేదు. ఈ గ్రూప్ గురించి ఒక స్నేహితురాలు చెప్పింది. ప్రియాంక చెప్పిన మాటలు నిజంగా నా జీవితంలో మార్పు కనిపించింది. నన్ను నేను అర్థం చేసుకోగలుగుతున్నా. లాక్‌డౌన్‌కు ముందు రెడ్ సారీ రన్ ఈవెంట్‌కి హాజరయ్యాను. చాలా సంతోషంగా ఉంది.' అంటారు సభ్యురాలు గీతా సోనావానే.

'నేను గర్భం దాల్చిన తర్వాత గత ఏడేళ్లుగా మధుమేహంతో బాధపడుతున్నాను. దానిని అదుపులో ఉంచుకోవడానికి చాలా కష్టపడ్డాను. ఒకరోజు నేను బ్లాగును చూసి వడోదర మామ్స్‌లో చేరాలని నిర్ణయించుకున్నా. ఇప్పుడు రెగ్యులర్ ఫిట్‌నెస్ వర్క్‌షాప్‌లతో నా షుగర్ లెవల్స్ ఇప్పుడు నార్మల్‌గా ఉన్నాయి. నేను రోజంతా హుషారుగా ఉంటా. బరువూ తగ్గింది.' అని మరో సభ్యురాలు వ్యాపారవేత్త జాగృతి గోహిల్ అంటారు. రకరకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న మహిళలను ఒకతాటి మీదకు తీసుకొచ్చి వారి వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్న ప్రియాంక ఎన్నో అవార్డులు, రివార్డులూ అందుకున్నారు.



జనవరి 20న రూ.100 లకే మల్టీప్లెక్స్ సినిమా..


ఈ నెల 20న సినిమా ప్రేమికుల దినోత్సవం సందర్భంగా పీవీఆర్ సినిమాస్ ఓ ఆఫర్ ప్రకటించింది. ఆ ఒక్క రోజు పీవీఆర్‌లో అన్ని షోలను రూ.99లకే చూడవచ్చని తెలిపింది. అయితే ఈ టికెట్లకు జీఎస్టీ అదనంగా ఉంటుంది. కేవలం ఎంపిక చేసిన నగరాల్లోనే ఈ బంపర్ ఆఫర్ వర్తించనుంది.

ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటకలో టిక్కెట్ ధర రూ.100లకు అదనంగా జీఎస్‌టీతో కలిపి ఉండనుంది. తెలంగాణలో మాత్రం రూ.112లకు అదనంగా జీఎస్‌టీతో టిక్కెట్లు రేట్లు ఉండనున్నాయి. అయితే రిక్లైనర్, ఐమాక్స్, 4డీఎక్స్ వంటి ప్రీమియం కేటగిరీ సీట్స్‌కి ఈ ఆఫర్ వర్తించదని యాజమాన్యం తెలిపింది. అలాగే జనవరి 20న మాత్రమే ఈ ఆఫర్ పని చేస్తుందని పీవీఆర్ సినిమాస్ వెల్లడించింది.

'హంట్' ట్రైలర్ విడుదల



సుధీర్ బాబు హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'హంట్'. భవ్య క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత వి. ఆనంద ప్రసాద్ ఈ సినిమాని నిర్మించారు. మహేష్ దర్శకత్వం వహించారు. రిపబ్లిక్ డే కానుకగా జనవరి 26న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుండి ప్రభాస్ ట్రైలర్ విడుదల చేశారు. చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. పట్టపగలు ఓ అసిస్టెంట్ కమిషనర్ హత్యకు గురవుతారు. ఆ కేసు ఇన్వెస్టిగేట్ చేసే క్రమంలో హీరోకు ఎటువంటి పరిస్థితులు ఎదురయ్యాయి? ఏం చేశారు? అనేది ఈ చిత్రంలో చూపించబోతున్నారు.



'కస్టడీ' కృతిశెట్టి

నాగ చైతన్య, వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో వస్తున్న 'కస్టడీ' సినిమా నుండి కృతిశెట్టి లుక్ బుధవారం విడుదలచేశారు. జైలు గోడల మధ్య చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్న ఆమె బలమైన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. పాత్ర పేరు రేవతి అని మేకర్స్ ఓ ప్రకటనలో తెలిపారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో విడుదలకానుంది. తమిళ నటుడు అరవింద్ స్వామి ఇందులో విలన్ పాత్రలో కనిపిస్తున్నారు. ప్రియమణి ఇంకో ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. శ్రీనివాస చిట్టూరి దీనికి నిర్మాత. మాస్ట్రో ఇళయరాజా, అతని కుమారుడు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.

సుహాస్ కొత్త సినిమా లుక్

యువ నటుడు సుహాస్ నటిస్తున్న కొత్త సినిమా 'ఆనందరావ్ అడ్వంచర్స్'. ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలోనే సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా లాంచ్ చేశారు. సుహాస్ కిరీటం పెట్టుకుని.. చేతిలో పాల సీసాతో స్వర్గలోకం నుంచి భూలోకానికి వస్తున్నట్టుగా ఉన్న ఫన్నీ పోస్టర్‌తో అందరినీ ఆకర్షిస్తున్నాడు. ఈ కార్యక్రమానికి టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆనంద్ దేవరకొండ, క్రిష్, నందినీ రెడ్డి, బీవీఎస్ రవి సినీ ప్రముఖులు పాల్గొన్నారు. రామ్ పసుపులేటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జెపీ స్టూడియోస్ నిర్మిస్తోన్న ఈ చిత్రాన్ని ఉదయ్ కోల, విజయ్ శేఖర్ అన్నె, సురేశ్ కొత్తింటి నిర్మాతలుగా, సుహాసిని రాహుల్, మురళీ జంపన సహనిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.





జై సల్మీర్‌లో షూటింగ్

హీరో మోహన్ లాల్‌కు తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ హీరో ప్రస్తుతం లిజో జోష్ పెల్లిస్సెరీ దర్శకత్వంలో 'మలైకొట్టై వాలిబన్' సినిమాలో నటిస్తున్నారు. రాజస్థాన్‌లోని జైసల్మీర్‌లో ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతుందని మేకర్స్ తెలిపారు. మోహన్ లాల్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరణ జరుగుతుంది. దానికి సంబంధించిన ఫొటోలు షేర్ చేశారు. చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ విద్యుత్ జమ్వాల్, రాధికా ఆప్టే, సోనాలీ కులకర్ణి, డానిష్ సేత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పీరియాడిక్ డ్రామా బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మ్యాక్స్ ల్యాబ్స్-సెంచరీ ఫిలిమ్స్ బ్యానర్లపై జాన్-మేరీ క్రియేటివ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

శెహభాష్ 'శుభ్‌మన్'

డబుల్ కొట్టిన పిన్న వయస్కుడిగా రికార్డు

న్యూజిలాండ్‌పై 12 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు



హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత్ 12 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఛేదనలో భాగంగా న్యూజిలాండ్ జట్టు చివరి ఓవర్‌లో 20పరుగులు చేయాల్సి దశలో శార్దూల్ వేసిన తొలి బంతికే బ్రాస్‌వెల్ సిక్సర్ కొట్టాడు. రెండో బంతిని శార్దూల్ వైడ్ వేయడంతో న్యూజిలాండ్ జట్టు 5 బంతుల్లో 13పరుగులు చేయాల్సి వచ్చింది. ఆ దశలో శార్దూల్ ఓ అద్భుత యార్కర్ ద్వారా బ్రాస్‌వెల్‌ను ఎల్‌బీ చేసి భారత్‌ను గెలిపించాడు. దీంతో భారత్ 12 పరుగులు తేడాతో గెలిచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శుభ్‌మన్‌కు లభించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను ఓపెనర్ శుభ్‌మన్ గిల్(208) డబుల్ సెంచరీతో ఆదుకున్నాడు. కేవలం 145 బంతుల్లోనే డబుల్ సెంచరీ చేసిన శుభ్‌మన్.. 149బంతుల్లో 19ఫోర్లు, 9సిక్సర్లు కొట్టి కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఫెర్గూసన్ వేసిన ఓవర్లో వరుసగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శుభ్‌మన్ సిక్సర్లతోనే 50, 150, 200పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. చివరి ఓవర్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన గిల్ 208 పరుగుల వద్ద ఔటయ్యాడు. రోహిత్(34), సూర్యకుమార్(31), హార్దిక్(28) బ్యాటింగ్‌లో రాణించారు. కివీస్ బౌలర్లలో షిప్లే, మిచెల్ రెండు వికెట్లు, ఫెర్గూసన్, టిక్నర్, సాంట్నర్‌కు తలా ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 131పరుగులకే 6వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. ఆ దశలో బ్రాస్‌వెల్(140), సాంట్నర్(57) కలిసి 7వ వికెట్‌కు 162పరుగుల జతచేసి ఆశలు రేపారు. చివర్లో బ్రాస్‌వెల్ ఔటవ్వడంతో కివీస్ ఓటమి ఖాయమైంది. సిరాజ్‌కు నాలుగు, కుల్దీప్, శార్దూల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి.

డబుల్ సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా శుభ్‌మన్ రికార్డు..

డబుల్ సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా శుభ్‌మన్ గిల్ రికార్డు నెలకొల్పాడు. శుభ్‌మన్ 23ఏళ్ల 123 రోజుల వయసులో డబుల్ సెంచరీని చేస్తే.. ఇషాన్ కిషన్(24ఏళ్ల 145రోజులు), రోహిత్ శర్మ(26ఏళ్ల 186రోజులు) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. అలాగే వన్డేల్లో డబుల్ సెంచరీని చేసివన ఐదో భారత క్రికెటర్‌గా శుభ్‌మన్ గిల్ మరో రికార్డు నెలకొల్పాడు.


స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ (సి)మిఛెల్ (బి)టిక్నెర్ 34, శుభ్‌మన్ (సి)ఫిలిప్స్ (బి)షిప్లే 208, కోహ్లి (బి)సాంట్నర్ 8, ఇషాన్ (సి)లాథమ్ (బి)ఫెర్గుసన్ 5, సూర్యకుమార్ (సి)సాంట్నర్ (బి)మిఛెల్ 31, హార్దిక్ (బి)మిఛెల్ 28, సుందర్ (ఎల్‌బి)షిప్లే 12, శార్దూల్ (రనౌట్)సాంట్నర్/లాథమ్ 3, కుల్దీప్ (నాటౌట్) 5, షమీ (నాటౌట్) 2, అదనం 13. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 349 పరుగులు. **వికెట్ల పతనం:** 1/60, 2/68, 3/110, 4/175, 5/249, 6/292, 7/302, 8/345 **బౌలింగ్:** షిప్లే 9-0-74-2, ఫెర్గుసన్ 10-0-77-1, టిక్నెర్ 10-0-69-1, సాంట్నర్ 10-0-56-1, బ్రాస్‌వెల్ 6-0-43-0, మిఛెల్ 5-0-30-2.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: ఫిన్ (సి)షాబాజ్ (బి)శార్దూల్ 40, కాన్వే (సి)కుల్దీప్ (బి)సిరాజ్ 10, నికోల్స్ (బి)కుల్దీప్ 18, మిఛెల్ (ఎల్‌బి)కుల్దీప్ 9, లాథమ్ (సి)సుందర్ (బి)సిరాజ్ 24, ఫిలిప్స్ (బి)షమీ 11, బ్రాస్‌వెల్(ఎల్‌బి) శార్దూల్ 140, సాంట్నర్ (సి)సూర్యకుమార్ (బి)సిరాజ్ 57, షిప్లే (బి)సిరాజ్ 0, ఫెర్గ్యుసన్ (సి)శుభ్‌మన్ (బి)హార్దిక్ 8, టిక్నెర్ (నాటౌట్) 1, అదనం 19. (49.2 ఓవర్లలో ఆలౌట్) 337పరుగులు. **బౌలింగ్:** షమీ 10-1-69-1, సిరాజ్ 10-2-46-4, హార్దిక్ 7-0-70-1, కుల్దీప్ 8-1-43-2, శార్దూల్ 7.2-0-54-2, సుందర్ 7-0-50-0

టాప్‌సీడ్ నాదల్ ఔట్..

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ రెండోరౌండ్‌లో పెను సంచలనం నమోదైంది. టాప్‌సీడ్, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ అనూహ్యంగా రెండోరౌండ్‌లో ఓటమిపాలయ్యాడు. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో నాదల్ 4-6, 4-6, 5-7తో మెక్ డొనాల్డ్(అమెరికా) చేతిలో ఓడాడు. ఇక రష్యాకు చెందిన 7వ సీడ్ మెద్వదెవ్, గ్రీక్‌కు చెందిన 3వ సీడ్ సిట్సిపాస్ మూడోరౌండ్‌లోకి ప్రవేశించారు. మెద్వదెవ్ 7-5, 6-2, 6-2తో జాన్ మిల్మన్(ఆస్ట్రేలియా)పై, సిట్సిపాస్ 6-3, 6-0, 6-2తో హిజికటరా(స్ట్రేలియా)పై వరుససెట్లలో గెలిచారు.

మూడోరౌండ్‌కు స్వైటెక్, పెగులా

టాప్‌సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్), 3వ సీడ్ పెగులా(అమెరికా) మూడోరౌండ్‌లోకి ప్రవేశించారు. స్వైటెక్ 6-2, 6-3తో ఒస్సోరియో (కొలంబియా)పై, పెగూలా 6-2, 7-6(7-5)తో సన్నోవిక్(రష్యా)పై సునాయాసంగా గెలిచారు. 6వ సీడ్ సక్కారి(గ్రీక్) 3-6, 7-5, 6-3తో స్నైడర్(రష్యా)పై గెలుపొందగా.. 15వ సీడ్ క్విటోవా(చెక్) 5-7, 4-6తో కలినినా(ఉక్రెయిన్) చేతిలో ఓటమిపాలైంది.

ద్యుతీచంద్‌పై తాత్కాలిక నిషేధం: వాడా



న్యూఢిల్లీ : 2019లో యునివర్సైడ్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల విభాగంలో స్వర్ణం సాధించిన తొలి మహిళా స్ప్రింటర్ ద్యుతీచంద్ డోపింగ్ టెస్టులో పట్టుబడింది. ద్యుతీకి నిర్వహించిన శాంపిల్-ఏ టెస్టు రిజల్ట్ పాజిటివ్‌గా వచ్చినట్లు వరల్డ్ యాంటీ డోపింగ్ ఎజెన్సీ(వాడా) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ద్యుతీకి నిర్వహించిన శాంపిల్- ఏ టెస్టు రిజల్ట్ పాజిటివ్‌గా వచ్చింది. నిషేధిత సార్స్ ఉత్ప్రేరకం వాడినట్లు తేలింది. దీంతో వాడా ఆమెను తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ద్యుతీ అబ్జర్వేజన్‌లో ఉందని.. శాంపిల్-బి టెస్టు పరిశీలించాక తుది ఒక నిర్ణయం తీసుకుంటాం" అని వాడా ఆ ప్రకటనలో పేర్కొంది.

ఆంధ్ర 415ఆలౌట్

రాజ్‌కోట్: ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 415పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 256పరుగులతో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్రప్రదేశ్ జట్టును అశ్విన్ హెబ్బర్(109) సెంచరీతో ఆదుకున్నాడు. లలిత్(32), నితీశ్(28) ఫర్వాలేదనిపించారు. జడేజా, దోడియాకు మూడేసి, సకారియాకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర జట్టు రెండోరోజు ఆటముగిసే సమయానికి 3వికెట్లు నష్టపోయి 122పరుగులు చేసింది.

ఎంసిఏ వేదికగా జరుగుతున్న ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు 5వికెట్ల నష్టానికి 176పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 353పరుగులతో రెండోరోజు ఆటను కొనసాగించిన సౌరాష్ట్ర జట్టు 385పరుగులకు ఆలౌటైంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68